# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 147 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 17 జులై 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 147 17-07-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




**తెలుగు రాష్ట్రాలపై 'కరువు' మేఘం..**

**వచ్చే వారం చాలా కీలకం!**

2 లో..

## వచ్చే నెలలో ప్రధాని మోడీ

# చైనా టూర్!

- షాంఘై కో ఆపరేషన్ సదస్సులో పాల్గొంటారన్న అధికారులు
- చైనా ప్రెసిడెంట్ జిన్ పింగ్ తో భేటీ కానున్న మోదీ
- సరిహద్దుల్లో ఘర్షణ తర్వాత తొలిసారి చైనా పర్యటన!



**న్యూఢిల్లీ జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో చైనాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. చైనాలోని తియాంజిన్ వేదికగా షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు (ఎస్ సీవో) జరగనుంది. ఈ సదస్సుకు ప్రధాని మోదీ హాజరుకానున్నారని అధికారవర్గాల సమాచారం. ఇందుకోసం ఆగస్టు లేదా సెప్టెంబర్ లో మోదీ చైనాకు వెళతారని తెలిపాయి. లడఖ్ సరిహద్దుల్లో చైనా – భారత సైనికుల మధ్య ఘర్షణ తర్వాత తొలిసారి ప్రధాని

- తరువాయి 2లో..

## అమెరికాలో కరోనా...

# కొత్త వేరియంట్లు...

- పెరుగుతున్న కేసులు
- అగ్రరాజ్యంలో కరోనా కలకలం
- ప్రస్తుతం యూఎస్ లో వేసవి సెలవులు... జోరుగా ప్రయాణాలు చేస్తున్న ప్రజలు
- వేగంగా వ్యాపిస్తున్న కరోనా వైరస్

యావత్ ప్రపంచాన్ని కరోనా మహమ్మారి ఎంతగా వణికించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. లక్షలాది మంది ఈ వైరస్ భూతం బారినపడి ప్రాణాలు కోల్పోయారు. సకాలంలో వ్యాక్సిన్లు రావడంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. లేకుంటే మరింత జన నష్టం సంభవించేది. తాజాగా అమెరికాలో కరోనా వైరస్ మరోసారి కలకలం సృష్టిస్తోంది. గత కొన్ని రోజులుగా అగ్రరాజ్యంలో కరోనా బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో వేసవి కాలం కావడంతో,

- తరువాయి 2లో..





## హస్తినలో ముగిసిన తెలుగు రాష్ట్రాల

# ముఖ్యమంత్రుల సమావేశం

- కేంద్రమంత్రి పాటిల్ సమక్షంలో చంద్రబాబు, రేవంత్ భేటీ
- 13 అంశాలపై దాదాపు గంటన్నర పాటు సమావేశం
- జలవివాదాలపై ఇద్దరు సిఎంలతో పాటిల్ చర్చలు
- గోదావరి ,కృష్ణా నీటి కేటాయింపులపై తెలంగాణ పట్టు
- మిగుల జలాల అంశాలపై ఏపీ ప్రత్యేక దృష్టి
- కేంద్రం ఎదుట వాదనలు వినిపించిన ఇరు రాష్ట్రాలు
- శ్రమ శక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో సమావేశం

**న్యూఢిల్లీ జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ముగిసింది. ఏపి, తెలంగాణల మధ్య జల వివాదాల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కీలక సమావేశం జరిగింది. ఇందులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు , తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు, ఆయా రాష్ట్రాల నీటి పారుదల మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.. ఈ భేటీ ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న పాత వివాదాల పరిష్కారానికి కేంద్రం తీసుకుంటున్న తాజా ప్రయత్నంగా పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాల కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం ముఖ్యంగా కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చినట్లు సమాచారం.. విభజన ముందునాటి కేటాయింపులపై అభ్యంతరం చెప్పారు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన సుమారు గంటన్నర పాటు ఈ సమావేశం జరిగింది. గోదావరి – బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ ఎజెండాగా ఆంధ్రప్రదేశ్.. 13 అంశాలతో తెలంగాణ ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలను కేంద్రం ముందు ఉంచాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రులతో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖ

- తరువాయి 2లో..



## ఆ విషయం

# చర్చకు రాలేదు..

- చంద్రబాబుతో భేటీ అనంతరం మీడియాతో రేవంత్ రెడ్డి!
- బనకచర్ల ప్రాజెక్టు కడతామనే ప్రతిపాదన రాలేదన్న తెలంగాణ ముఖ్యమంత్రి
- అలాంటప్పుడు ఆపాలనే చర్చ కూడా ఉండదని వ్యాఖ్య
- కేంద్రం కేవలం నిర్వాహక పాత్ర పోషించిందన్న రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన సమావేశం అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో బనకచర్ల అంశంపై

- తరువాయి 2లో..

## ఏపీని క్రీడా హబ్‌గా..

# తీర్చిదిద్దుతున్నాం..

- కేంద్ర పరంగా చేయూత ఇవ్వండి - చంద్రబాబు
- క్రీడా శాఖ మంత్రి మాండవీయాకు చంద్రబాబు వినతి



**న్యూఢిల్లీ జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఖేలో ఇండియా నిధులివ్వాలని కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ఎపి సిఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో పర్యటనలో ఉన్న చంద్రబాబు నేడు కేంద్ర మంత్రి మాండవీయను చంద్రబాబు కలిశారు. ఏపీలో స్టేడియంల నిర్మాణం, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి రూ. 341 కోట్లు కేటాయింపుల అంశంపై చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో బ్యాడ్మింటన్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం చేపట్టాల్సిన ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్ర

- తరువాయి 2లో..

## జలవివాదాలపై

# నిపుణులతో కమిటీ

### మంత్రి నిమ్మల నాయుడు



**న్యూఢిల్లీ జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తామని కేంద్రం జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నిర్ణయించారని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఈ కమిటీని సోమవారం లోపు ఏర్పాటు చేస్తామన్నారన్నారు. ఈ కమిటీలో కేంద్ర, రాష్ట్రాల నిపుణులు ఉంటారని చెప్పారన్నారు. న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ లతో నేడు సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు న్యూఢిల్లీలో

- తరువాయి 2లో..

## తెలంగాణలో జిల్లాల వారిగా

## జెడ్పీటిసి, ఎంపీటీసీల స్థానాలు ఇవే..

**హైదరాబాద్, జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపిపి, జడ్పీటిసీ స్థానాలను ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం .. 31 జిల్లాలలో మొత్తం 566 ఎంపిపి లు, జడ్పీటీసీ లుగా నిర్ధారించింది.. అలాగే మొత్తం 5773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని పేర్కొంది.. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీచేసింది రేవంత్ ప్రభుత్వం




## ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు

# రాజకీయ పార్టీలకు లేదా ? : వైఎస్.జగన్

**గుంటూరు, జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గుంటూరు : ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు రాజకీయ పార్టీలకు లేదా ? అని వైఎస్.జగన్ అన్నారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ... తాడిపత్రిలో ఓ మాజీ ఎమ్మెల్యే (కేతిరెడ్డి పెద్దారెడ్డి) తన సొంత ఇంటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. హైకోర్టు ఆదేశాలున్నా.. పోలీసులు అడ్డుతగులుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై పచ్చ సైకోలు.. అదీ పోలీసుల సమక్షంలోనే దాడికి ప్రయత్నించారని, బీహార్‌లో ఉన్నామా ? ఆటవిక రాజ్యంలో ఉన్నామా ? చంద్రబాబు తనను తాను ప్రశ్నించుకోవాలి

- తరువాయి 2లో..



# టిడ్కో ఇళ్లకు స్థల సేకరణ

### అధికారులను ఆదేశించిన నారా లోకేష్..



**మంగళగిరి జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మంగళగిరి – గతంలో 3వేల మందికి సుమారు వెయ్యి కోట్ల విలువైన ఇళ్ల పట్టాలు అందజేశామని, ఆగస్టులో మరో 2వేలు పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు మంత్రి నారా లోకేష్ .. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదల కోసం కొత్తగా టిడ్కో గృహ సముదాయాల స్థలసేకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంగళగిరిలోని ప్రస్తుత టిడ్కో సముదాయం వద్ద పార్కు అభివృద్ధికి చర్య తీసుకోవాలని సూచించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రి ఈ రోజు ఉండవల్లి నివాసంలో అధికారులతో సమీక్షించారు. ఎంటీఎంసీ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సమీకృత అండర్ గ్రౌండ్ డ్రైనేజి, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో సీఎస్ఆర్, ప్రభుత్వ నిధులతో నిర్మించ తలపెట్టిన 31 కమ్యూనిటీ హాళ్లు, 26 పార్కులు, శ్మశానాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఎకో పార్కు అభివృద్ధి**

వరద నివారణకు మహానాడు కాలనీ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులతో పాటే

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# తెలుగు రాష్ట్రాలపై 'కరువు' మేఘం..

## వచ్చే వారం చాలా కీలకం!

▶▶ బ్రేక్ మాన్ సూన్ తరహా వాతావరణం ▶▶ ఇప్పటికే 10 శాతం లోటు వర్షపాతం

**అమరావతి జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**తెలుగు రాష్ట్రాలపై 'కరువు' మేఘం కమ్మేస్తోంది. బ్రేక్ మాన్ సూన్ తరహా వాతావరణం కలవరపాటుకు గురిచేస్తోంది. సీజన్లో అత్యంత కీలకమైన జులై తీవ్ర నిరాశపరిచింది. ఇప్పటికే 10 శాతం వర్షపాతం లోటు నమోదవ్వగా.. వచ్చే వారం పది రోజులు చాలా కీలకమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈలోగా వర్షాలు కురిసి సాధారణ స్థితికి రాకపోతే పంటలు దెబ్బతినే అవకాశాలు బాగా పెరుగుతాయి. ఈ ఏడాది 9 రోజులు ముందుగానే రుతుపవనాలు వచ్చినప్పటికీ రైతులకు అవసరం అయిన సమయంలో వానలు లేకుండా పోయాయి. అల్పపీడనాల ఫ్రీక్వెన్సీ తగ్గిపోవడం నైరుతిలో లోటు వర్షపాతానికి ఒక కారణంగా భావిస్తున్నారు.**



ప్రతుతం రాజస్థాన్ పరిసరాల్లో వాయుగుండం కొనసాగుతోంది. మరోవైపు ఉత్తర ఝూర?ండ్, దక్షిణ బిహార్ పరిసరాల్లో తీవ్ర అల్పపీడనం సైతం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బుధ, గురువారాల్లో పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలకు అవకాశముందని వాతావరణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. రాబోయే మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. బుధ, గురువారాల్లో తేమ, ఉక్కపోత వాతావరణం కొనసాగే అవకాశముందని తెలిపింది. ప్రస్తుతం వర్షాల కోసం రైతాంగం వేయి కళ్లతో ఎదురుచూస్తోంది. కొన్నిచోట్ల వర్షాలు లేక పత్తి చెట్లు ఎండిపోతున్నాయి. మరోవైపు వరి నాటు వేసేందుకు వర్షం రైతులు చూస్తున్నారు.

# సంపాదకీయం

## బ్రిక్స్... ట్రంప్... కాగితం పులి కథ!

**బ్రెజిల్‌లోని రియో డి జనేరో నగరంలో ఈ నెల 6%-%7 తేదీలలో జరిగిన 'బ్రిక్స్' 17వ శిఖరాగ్ర సమావేశాలను ఒకవైపు, దానిపై మొదటినుంచే కత్తులు దూసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను మరొకవైపు గమనించగా కాగితం పులి కథ గుర్తుకు వస్తుంది. బ్రిక్స్... తన సభ్య దేశాల అభివృద్ధికి, పరస్పర సహకారానికి ఏర్పడినటువంటిది. 2009లో స్థాపించినప్పటి నుంచి గత 16 సంవత్సరాలలో అందుకు అనుగుణంగా వ్యవహరిస్తూ వచ్చింది తప్ప, అమెరికాకు గానీ, మరొకరికిగానీ వ్యతిరేకంగా ఎప్పుడు ఏ చర్యలూ తీసుకోలేదు.**

అయినప్పటికీ, అమెరికా అధ్యక్షులందరికి భిన్నమైన రీతిలో ట్రంప్ మాత్రం బ్రిక్స్‌ను తమకు వ్యతిరేకమైన కూటమి అంటున్నారు. అధికారానికి వచ్చిన కొత్తలో బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఇపుడు బ్రెజిల్ సమావేశాలకు ముందు రోజున 10 శాతం అన్నారు. బ్రిక్స్‌లో చేర రాదంటూ ప్రపంచ దేశాలను కొన్ని నెలలుగా ఒత్తిడి చేస్తున్నారు. కానీ, ఈసారి సమావేశాలు ముగిసే నాటికి, ట్రంప్‌ను అమెరికా సన్నిహిత దేశాలు సహా ఎవరూ ఖాతరు చేయనట్లు స్పష్టమైంది.

### జనాభా... జీడీపీ... 40 శాతం వాటా!

2009లో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలలో బ్రిక్‌గా మొదలైన సంస్థ, దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్‌గా మారటం తెలిసిందే. ట్రంప్ హెచ్చరికలు చేసిన మరునాడే ఇండోనేషియా పూర్తి సభ్య దేశంగా చేరింది. ఇపుడు బ్రెజిల్‌లో బేలారూస్, బొలీవియా, కజకిస్థాన్, క్యూబా, నైజీరియా, మలేషియా, థాయ్‌లాండ్, వియత్నాం,ఉగాండా, ఉబ్జెకిస్తాన్ భాగస్వామ్య దేశాలుగా కొత్తగా చేరాయి. బ్రెజిల్ సమావేశాల కన్న ముందు మాసాలలో ఈజిప్టు, ఇథియో పియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ పార్ట్‌నర్ దేశాలయ్యాయి.

ఈ జాబితాను విశ్లేషించినట్లయితే నాలుగు విషయాలు దృష్టికి వస్తాయి. ఒకటి, సంఖ్య రీత్యా ఇపుడవి మొత్తం 21 దేశాలు. రెండు, అమెరికా, యూరప్‌తో కూడిన పాశ్చాత్య ప్రపంచానికి బయటగల ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలన్నింటికి అందులో ప్రాతినిధ్యం ఉంది. మూడు, వాటిలో అనేకం ఆర్థికంగా శక్తిమంతమై నవి. నాలుగు, బహుశా అంతకన్న విశేషంగా పలు దేశాలకు అమెరి కాకు అనుకూలమైనవనే పేరున్నది. అటువంటి పేరే గల ఆసియన్ కూటమి దేశాలు కూడా బ్రిక్స్‌కు తోడుకావటం మరొక విశేషం.

తాజా విస్తరణ తర్వాత బ్రిక్స్ దేశాల జనాభా మొత్తం ప్రపంచ జనాభాలో 41 శాతానికి చేరింది. వీటి జీడీపీ ప్రపంచ జీడీపీలో 40 శాతం అయింది. ఇవన్నీ అభివృద్ధి చెందిన దేశాల కూటమి అయిన జి%-%7కు మించిపోయిన లెక్కలు. బ్రిక్స్ నెలకొల్పిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి) రుణ సహాయాలతో 40 బిలియన్ డాలర్ల విలువ గల 120 అభివృద్ధి పథకాలను వర్ధమాన దేశాలలో అమలుపరుస్తున్నారు. అమెరికా చెప్పు చేతలలో గల ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ తరహా షరతులుగానీ, ఆయా దేశాల ఆర్థిక విధా నాలలో జోక్యం గానీ బ్రిక్స్ బ్యాంక్ నుంచి ఉండవు.

### అమెరికాకు ఎందుకు కలవరం?

అమెరికా తన డాలర్‌ను ఒక ఆయుధంగా ఉపయోగిస్తూ ప్రపంచ దేశాల కరెన్సీ విలువలను, మార్కెట్లను, బ్యాంక్ చెల్లింపులను, రిజర్వ్‌లను నియంత్రిస్తున్నందున, తమకు సరిపడని దేశాల డాలర్ అకౌంట్లను స్తంభింపజేస్తున్నందున, డాలర్ మారకం నుంచి విముక్తి అవసరమని బ్రిక్స్ దేశాలు కొంతకాలం క్రితమే నిర్ణయించుకున్నాయి.

ముఖ్యంగా నిరుడు అక్టోబర్‌లో రష్యాలోని కజాన్ నగరంలో జరిగిన 16వ సమావేశాలలో ఇందుకు మరింత కదలిక వచ్చింది. ఆ ప్రకారం బ్రిక్స్ దేశాలు డాలర్‌తో సంబంధాలను ఒకే సారి పూర్తిగా తెంచుకోవటంగాక, తమ మధ్య వాణిజ్యానికి పరస్పర చెల్లింపులు డాలర్‌లో గాక వీలైనంత మేర తమ సొంత కరెన్సీలలో జరుపుకోవాలనీ, ఆ స్థాయిని క్రమంగా పెంచుకోవాలనీ నిర్ణయించుకున్నాయి. ఈ పని బ్రిక్స్ దేశాల మధ్యనే గాక, ఇతర దేశాలతోనూ జరిగేందుకు ప్రయత్నించాలని భావించాయి. అనగా డాలర్ పాత్రను, ఆధిపత్యాన్ని తగ్గించటమన్నమాట!

నిజానికి స్థానిక కరెన్సీలలో చెల్లింపుల పద్ధతి స్వల్ప స్థాయిలో గతంలోనూ ఉండేది. కానీ బ్రిక్స్ నిర్ణయాలతో అది గణనీయంగా పెరిగి ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో 30 శాతానికి మించినట్లు అంచనా. బ్రెజిల్ విస్తరణతో ఈ ధోరణి పెరిగినట్లయితే, త్వరలో 50 శాతానికి చేరే అవకాశం ఉంది. బ్రిక్స్ అంటే అమెరికా అధ్యక్షుడు ఎందుకింత కలవరపడుతున్నారో, దీన్ని బట్టి తేలికగా అర్థం చేసు కోవచ్చు.

ప్రపంచంపై అమెరికా సామ్రాజ్యవాదపు ఆధిపత్యం వెంటనే అంతం కాక పోయినా క్రమంగా బలహీనపడుతుంది. మారిన పరిస్థితులలో ఒకప్పటివలె బ్రిక్స్ వంటి దేశాలపై ప్రత్యక్ష యుద్ధాలు చేయలేరు గనుక, టారిఫ్‌ల హెచ్చింపు, ఇతర వాణిజ్య ఆంక్షల రూపంలో ఆర్థిక యుద్ధాలు ప్రకటిస్తున్నారు.

వాస్తవానికి, అమెరికా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, ఇతరుల నుంచి వస్తున్న పోటీలను తట్టుకునేందుకు ఆయన స్వపర భేదాలు లేకుండా అన్ని దేశాలపై ఎడాపెడా టారిఫ్‌ల యుద్ధం ఆరంభించారు. అయితే, బ్రిక్స్‌తో వైరం భిన్నమైనది. ఆ సంస్థ వర్ధమాన దేశాల కోసం భిన్న మైన, దీర్ఘకాలిక, ప్రత్యామ్నాయ వ్యవస్థను సృష్టించే అజెండాతో పని చేస్తున్నది. ఆర్థికంగానే కాదు. అభివృద్ధి నమూనా దృష్ట్యా కూడా.

### వాణిజ్యంలో 'స్వేచ్ఛ' కోసం...

మరొక కీలకమైన అంశం స్వేచ్ఛా వాణిజ్యం. ఈ భావనను ముందుకు తెచ్చి డబ్ల్యూటీవోను నెలకొల్పిన అమెరికా కూటమి, దానిని తమ ప్రయోజనాలకు అనుకూలమైనంత కాలం ఉపయోగించుకుని, ఇటీవల ఇతర దేశాలు కూడా లాభపడుతుండటంతో ఆ నియమాలను భంగపరచజూస్తున్నది.

స్వేచ్ఛా వాణిజ్యం యథా తథంగా కొనసాగటమే గాక, ఆ సంస్థలో వర్ధమాన దేశాల గొంతుకలు వినవస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలన్నది బ్రిక్స్ వాదనలలోని ముఖ్యాంశాలలో ఒకటి. ఆ పని జరిగితే వర్ధమాన దేశాల వనరులకు, ఉత్పత్తులకు తగిన ధరలు లభిస్తాయి. ధనిక రాజ్యాలు ఇతరులను ఒత్తిడి చేసి తక్కువ ధరలకు కొనుగోలు చేయటం, తమ ఉత్పత్తులను మాత్రం అధిక ధరలకు విక్రయించటం వంటి పరిస్థితి పోతుంది.

మరొక స్థాయిలో బ్రిక్స్ దేశాలు అమెరికా ఏకధ్రువ ప్రపంచం ఆమోదయోగ్యం కాదనీ, బహుళ ధ్రువ ప్రపంచం తమ లక్ష్యమనీ స్పష్టంగానే చెప్తున్నాయి. బ్రిక్స్ గురించి యూరోపియన్ దేశాలు ఇంతవరకైతే వ్యతిరేకంగా మాట్లాడలేదుగానీ, అమెరికా వైపు చూస్తు న్నాయి. కజాన్, రియో డి జనేరో సమావేశాల దరిమిలా ట్రంప్‌పై ఒత్తిడి పెరిగింది.

ఈ పరిణామాల తక్షణ ప్రభావాల గురించి కూడా కొంత చెప్పు కోవాలి. ఇండియాను టారిఫ్‌లతో లొంగదీసి ఒప్పందాలు చేసుకో జూడగా, దానిపై ఒకవైపు చర్చలు సాగిస్తూనే, తాము కూడా 25 శాతం ఎదురు సుంకాలు విధించగలమని భారత ప్రభుత్వం డబ్ల్యూటీవోలో స్పష్టం చేసింది. తామూ అదే పని చేయగలమని బ్రెజిల్, వియత్నాం, 'ఆసియాన్', దక్షిణాఫ్రికా మొదలైనవి హెచ్చరించాయి.

చైనా, రష్యా సరేసరి. టారిఫ్‌లు ప్రకటించినపుడు ట్రంప్ మాట్లాడుతూ 90 రోజులలో 90 ఒప్పందాలు చేసుకోగలమని,అందరూ క్యూలు కడుతున్నారని ఆట్టహాసంగా అన్నారు. 90 రోజులు గడిచేసరికి జరిగినవి ఇంగ్లండ్, వియత్నాంలలో మాత్రమే. కెనడా, యూరప్ సైతం ధిక్కార స్వరంలోనే ఉన్నాయి. ఈ పరిణా మాల మధ్య బ్రిక్స్‌ను ఢీకొంటున్న ట్రంప్, కాగితం పులిగా మిగలటం తప్ప గత్యంతరం కనిపించదు.

## వచ్చే నెలలో ప్రధాని మోడీ చైనా టూర్!

మోదీ చైనాలో పర్యటించనున్నారని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తియాంజిన్ సిటీలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 తేదీ వరకు ఎస్ సీవో సమిట్ జరగనుంది. ఈ సమావేశంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత్ తరఫున ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తదితరులు పాల్గొంటారు. ఈ సదస్సు సందర్భంగా జిన్ పింగ్ తో ప్రధాని మోదీ చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఇందులో పలు ద్వైపాక్షిక అంశాలతో పాటు సరిహద్దు సమస్యలపైనా చర్చ జరగనుందని తెలుస్తోంది. తొలిసారిగా 2015లో ప్రధాని హోదాలో మోదీ తొలిసారి బీజింగ్ లో పర్యటించారు. ఆ తర్వాత కాలంలో ఇప్పటి వరకు మోదీ మొత్తం ఐదుసార్లు చైనాకు వెళ్లారు. 2020లో గల్వాన్ లోయలో ఇరుదేశాల సైనికుల మధ్య ఘర్షణ నెలకొంది. ఇరువైపులా సైనికులు చనిపోయారు. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అప్పటి నుంచి ప్రధాని మోదీ చైనాలో పర్యటించలేదు. తాజాగా భారత్ చైనాల మధ్య సంబంధాలను పునరుద్ధరించేందుకు చర్చలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ బీజింగ్ కు వెళ్లారు. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య చోటుచేసుకున్న ఇటీవలి పరిణామాల గురించి చర్చించారు.

## అమెరికాలో కరోనా... కొత్త వేరియంట్లు

సెలవులను ఆస్వాదించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ప్రయాణాలు చేస్తున్నారు. తీర ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలకు తరలిపోవడం వల్ల వైరస్ వేగంగా వ్యాపిస్తోందని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) వెల్లడించింది. ముఖ్యంగా ఫ్లోరిడా, టెక్సాస్, కాలిఫోర్నియా, ఒహియో వంటి రాష్ట్రాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సీడీసీ నివేదిక ప్రకారం, ఎన్బీ.1.8.1 మరియు ఎక్స్‌ఎఫ్ జీ అనే కొత్త వేరియంట్లు ప్రస్తుతం అమెరికాలో వ్యాప్తిలో ఉన్నాయి. ఈ కొత్త వేరియంట్ల ప్రభావం వల్ల గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె బరువుగా ఉండటం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే కరోనా పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా వైరస్ వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, రద్దీ ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలని, సాధ్యమైనంత వరకు సామాజిక దూరాన్ని పాటించాలని అధికారులు కోరుతున్నారు. ఈ పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు.

## హస్తినలో ముగిసిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం

మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ కార్యదర్శులు, ఇంజినీర్లు హాజరయ్యారు.

### రాయలసీమకు జీవనం బనకచర్ల ప్రాజెక్టు

ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి %-% బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో సముద్రంలో వృథాగా పోతున్న 200 టీఎంసీల గోదావరి వరద నీటిని కర్నూలు జిల్లా బనకచర్ల వరకు తరలించాలన్నది ప్రధాన ఉద్దేశ్యం. ఈ ప్రాజెక్టుతో 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ఏపీ వాదిస్తోంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి ఇది వెలుగుల బాటగా ఉంటుందని సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారు. కేంద్ర సహకారం అందితే తాము వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధమని ప్రకటించారు. కాగా, ఈ ప్రాజెక్టుకు అనుమతులు లేవని, అసలు ఈ విషయంలో చర్చక్కూడా ఓప్పుకోబోమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.. అయినప్పటికే ఎపి ప్రభుత్వం మిగులు జలాల అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చినట్లు సమాచారం.

## ఆ విషయం చర్చకు రాలేదు..

చర్చ జరగలేదని ఆయన స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి జలాల విషయంలో నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు అధికారులు, ఇంజినీర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తామనే ప్రతిపాదన ఈ సమావేశంలో రాలేదని ఆయన తేల్చి చెప్పారు. అలాంటి ప్రతిపాదనే రానప్పుడు దానిని ఆపాలనే చర్చ కూడా ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. ఇది అపెక్స్ కమిటీ సమావేశం కాదని కూడా ఆయన స్పష్టం చేశారు. గతంలో కేసీఆర్ తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేశారని రేవంత్ రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసమే ఈ సమావేశం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కేంద్రం ఎవరి పక్షానా మాట్లాడలేదని, కేవలం సమన్వయకర్త పాత్ర మాత్రమే పోషించిందని ఆయన పేర్కొన్నారు.

## ఏపీని క్రీడా హబ్‌గా..తీర్చిదిద్దుతున్నాం..

మంత్రితో సీఎం చర్చించారు. అమరావతిలో జాతీయ జల క్రీడల శిక్షణా హబ్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.. ఎపిలో క్రీడల అభివృద్ధికి కేంద్ర పరంగా తగిన సహాయం చేయాలని కోరారు.. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో బ్యాడ్మింటన్ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతిలో జాతీయ జల క్రీడల శిక్షణ హబ్ ఏర్పాటుకు అవకాశం ఉందని, కృష్ణా నదీ తీరంలో వాటర్ స్పోర్ట్స్ శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు అవకాశాలున్నాయని వివరించారు, నాగార్జునా యూనివర్సిటీ, కాకినాడలలో నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ల ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు వెల్లడించారు. తిరుపతి, రాజమహేంద్రవరం, కాకినాడ, నరసరావుపేటలలో ఖేలో ఇండియా కింద మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధికి రూ.27 కోట్లు, గుంటూరు బీఆర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రూ.170 కోట్లు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి రూ.341 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, మరో కేంద్ర మంత్రి చంద్రశేఖర్, ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి కూడా పాల్గొన్నారు..

## జలవివాదాలపై నిపుణులతో కమిటీ

విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ సమావేశం ఆహ్లాదకర వాతావరణంలో జరిగిందన్నారు. ఇరు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో చర్చలు జరిగాయని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

### కృష్ణా బోర్డు అమరావతిలో.. గోదావరి బోర్డు హైదరాబాద్ లో

ఆ క్రమంలో శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులు, రక్షణ చర్యలపై ఈ సందర్భంగా చర్చించామన్నారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి స్పష్టం పేర్కొన్నారని తెలిపారు. కృష్ణా నది బోర్డు అమరావతిలో ఉండేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే గోదావరి బోర్డు తెలంగాణలో ఏర్పాటు చేసేలా నిర్ణయించామని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్ట్ మరమ్మతులు చేసేందుకు ఏపీ అంగీకారించిదన్నారు. అలాగే టెలిమెట్రీ ఏర్పాటుకు సైతం అంగీకరించామని మంత్రి నిమ్మల వివరించారు.

### బనకచర్లపై..

కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీ ఆర్ పాటిల్ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం బుధవారం న్యూఢిల్లీలో జరిగింది. తెలుగు రాష్ట్రాల జల వివాదాలపై సుమారు గంటన్నర పాటు ఈ సమావేశం జరిగింది. అయితే ఈ సమావేశంలో పోలవరం- బనకచర్ల ప్రాజెక్ట్ ఆవశ్యతను సీఎం చంద్రబాబు వివరించినట్లు తెలుస్తుంది. గోదావరి నుంచి సముద్రంలోకి ఏటా 2 వేల నుంచి 3 వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తాయని తెలిపారు. ఈ నీటిని బనకచర్ల ద్వారా రాయలసీమకు మళ్లిస్తే ఆ ప్రాంతానికి లబ్ది చేకూరుతోందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోదాహరణగా ఈ భేటీలో వివరించారని సమాచారం. అలాగే అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను సైతం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆయన అందజేశారు. ఏ ఒక్క రాష్ట్రానికి ఇబ్బంది కలిగించకుండా.. సముద్రంలోకి వెళ్లే గోదావరి మిగులు జలాలను మాత్రమే వినియోగించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలుస్తుంది. ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ఎజెండాలోని 13 అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆ ప్రాజెక్ట్‌ల విషయంలో సీఎం చంద్రబాబు ఎటువంటి అభ్యంతరం తెలపలేదని సమాచారం.

## ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు రాజకీయ పార్టీలకు లేదా ? : వైఎస్.జగన్

అని అన్నారు. చంద్రబాబు ఏం మంచి చేశారని జనం వస్తారు ? అని ప్రశ్నించారు. పాలకుల తప్పిదం వల్లే మామిడి రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మామిడి రైతులకు తాను సంఘీభావం తెలపడం తప్పా ? అని అడిగారు. ఎల్లో పేపర్లు.. టిషఉ్య పేపర్లకు కూడా తక్కువేనని ఎద్దేవా చేశారు. బంగారుపాళ్యంలోనూ కేసులు పెట్టి.. అరెస్టులు చేశారని అన్నారు. రాష్ట్రంలో దిగజారిపోయిన పరిస్థితులు ఉన్నాయని ధ్వజమెత్తారు. పాలకులను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సెన్సార్ బోర్డు ఎందుకు ఉంది ? అని అడిగారు. ఎపిలో ప్రజాస్వామ్యం ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందన్నారు. సినిమా డైలాగులు చెప్పినా.. పోస్టర్లు ప్రదర్శించినా కేసులేనన్నారు. సినిమా డైలాగులు చెబితే చంద్రబాబుకి వచ్చిన నష్టమేంటి ? అని ప్రశ్నించారు. బాలకృష్ణ, పవన్ సినిమల్లో ఇంతకంటే దారుణమైన డైలాగులే ఉంటున్నాయి.. మరి వాటి సంగతి ఏంటి ? అని ప్రశ్నించారు. మంచి చేసిన తగ్గేదే లే అను.. అంతేగానీ ఇలా కాదు అని మండిపడ్డారు. చంద్రబాబు ప్రతీ ఆలోచనా కుట్రేనని ఆరోపించారు. రైతులకు తోడుగా నిలిస్తే తమపై కేసులు పెట్టారు అని చెప్పారు. తమ వాళ్లను తాము పరామర్శించినా కేసులు పెడుతున్నారు అని నిప్పులుచెరిగారు. కావాలనే తన సెక్యూరిటీని తగ్గించారు అని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తన పర్యటనల్లోనూ ఉద్దేశపూర్వకంగానే ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. తన పర్యటనలు అయ్యాక తప్పుడు కేసులు పెడుతున్నారు అని చెప్పారు. చంద్రబాబు ఆదేశాలతోనే పోలీసులు తమకు సహకరించలేదు అని జగన్ అన్నారు. రైతులు సమన్వయంతో ఉంటున్నారు కాబట్టే పరిస్థితి చేజారిపోవడంలేదు అని చెప్పారు. నిజంగా 50 వేలమంది 40 మంది మీద పడి ఉంటే పరిస్థితి ఏంటి ? అని అడిగారు. పోలీసులు ఉంటోంది తన పర్యటనల్లో భద్రత కలిపించేందుకు కాదు అని, తన కార్యక్రమానికి ఎవరూ రాకుండా ఉండేందుకు పోలీసులు.. ఇది ఆశ్చర్యం కలిగించే విషయం అని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు రాజకీయ పార్టీలకు ఉండదా ? అని జగన్ ప్రశ్నించారు. ప్రజలను చైతన్యవంతుల్ని చేయడం, మీటింగ్‌లు పెట్టుకోవడం.. ఇవన్నీ హక్కులే కదా అని అన్నారు. మరి రాజకీయ పార్టీకి ఉండాల్సిన మౌలిక హక్కులు నలభై ఏళ్ల రాజకీయానుభవం ఉన్న చంద్రబాబుకి తెలీదా ? అని ప్రశ్నించారు. గుడివాడలో దాడిని రాష్ట్రం మొత్తం చూసిందని, మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి చేశారని, బీసీ మహిళ ఉప్పాల హారికపై దాడి దుర్మార్గం అని ధ్వజమెత్తారు. తన సోదరి హారిక మీద టీడీపీ సైకోలు దాడి చేశారని ఆరోపించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటే.. పోలీసుల సమక్షంలో ఇది జరిగింది అని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని అన్నారు. ఒక బీసీ మహిళకు ఆత్మగౌరవం లేదా ?.. ఇంతమంది సైకోలుగా, శాడిస్టులుగా ప్రవర్తిస్తారా ? అని ప్రశ్నించారు. హారికను అనకూడని మాటలు అన్నారనీ, మళ్లీ మహానటి అంటూ ఆమెనే ఎద్దేవా చేస్తున్నారనీ నిప్పులు చెరిగారు. దానవీరశూరకర్ణ కంటే గొప్పగా నటించేంది చంద్రబాబేనన్నారు. స్పష్టంగా ఆధారాలు ఉంటే ఎంత మంది మీద కేసు పెట్టారు ? అని అడిగారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు రాజకీయ పార్టీలకు లేదా ? అని అడిగారు. " చంద్రబాబు ఈ విషయమై అడుగుతున్నా.. ప్రజాస్వామ్యంలో ఉన్నామా?.. ఇంకా ఎక్కడైనా ఉన్నామా? " అని జగన్ ప్రశ్నలు సంధించారు.

## టిడ్కో ఇళ్లకు స్థల సేకరణ : అధికారులను ఆదేశించిన నారా లోకేష్..

సమాంతరంగా సుందరమైన పార్కును కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. మంగళగిరి శివాలయం పక్కన అధునాతన సౌకర్యాలతో నిర్మించిన మోడల్ లైబ్రరీ పనులు తుదిదశకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోనే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నిడమర్రు మోడల్ పునర్మిర్మాణ పనులను సెప్టెంబర్ లోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ బృహత్ ప్రణాళిక వేగవంతంగా పూర్తిచేసి త్వరలో పనులు ప్రారంభించాలని సూచించారు. మంగళగిరిలో స్మార్ట్ స్ట్రీట్ బజార్, నిడమర్రు రోడ్డులో 350 షాపులతో అధునాతన కూరగాయలు, పూలు, పండ్ల మార్కెట్, పోలకంపాడు వద్ద రూ.2కోట్లతో చేపల మార్కెట్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి కూడా సందర్శకులు వస్తున్నందున మంగళగిరి ఎకో పార్కును ఎడ్వంచర్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో గుంతలు లేని రోడ్ల అభివృద్ధి, ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టమ్, నూరు శాతం వీధిలైట్లపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు, నియోజకవర్గ పరిధిలో చెరువుల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి లోకేశ్ చర్చించారు. ఈ సమావేశంలో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హలీమ్ బాషా, ఎండోమెంట్స్ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎంటీఎంసీ ఎస్ఈ శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ అశోక్, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ హయాంలోనే కోనసీమ అభివృద్ధి

- రాష్ట్రంలో గత 5 ఏళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ఏడాది పాలనలోనే చేశాం
- రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా చెప్పిన హామీలన్నీ అమలు చేస్తున్నాం
- 5 ఏళ్ల వైసీపీ పాలనలో జగన్ అన్ని వర్గాల ప్రజలను వంచన చేశారు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి స్వామి
- ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావుతో కలసి ఇంటింటికి తిరిగి కర పత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించిన మంత్రి





**డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ / అల్లవరం, జూలై 16 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంలో గత 5 ఏళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ఏడాది పాలనలోనే చేశామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం నాడు డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి డా.స్వామి పాల్గొన్నారు. ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావుతో కలిసి గ్రామంలో గడపగడపకు తిరుగుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి డా. స్వామి మాట్లాడుతూ..... రాష్ట్రంలో జగన్ రెడ్డి గత ఐదేళ్ల పాలన కాలంలో జరగని అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే చేసిందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నామన్నారు. కోనసీమలో అభివృద్ధి అంతా టిడిపి హయాంలోనే జరిగిందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలను వంచన చేసి విధ్వంసం వినాశనం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్లారన్నారు. నవరత్నాల పేరుతో నవ మోసాలు చేసి రాష్ట్రంలో ఉన్న సహజ వనరులన్నిటిని వైసీపీ నాయకులు లూటీ చేశారని దుయ్యబట్టారు. జగన్ సాగించిన విధ్వంసకర పాలన ఫలితంగానే రాష్ట్ర ప్రజలు 11 సీట్లు ఇచ్చి పక్కన కూర్చో పెట్టారని అన్నారు. అయినా జగన్ వ్యవహార శైలిలో మార్పు రాలేదని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఎద్దేవా చేశారు.







# జగన్ క్వాష్ పిటిషన్‌పై విచారణ రెండు వారాలకు వాయిదా

**వైఎస్ జగన్ క్వాష్ పిటిషన్ పై హైకోర్టులో విచారణ**

**సమయం కావాలని కోరిన ప్రభుత్వ న్యాయవాది**

**మరో రెండు వారాలకు విచారణను వాయిదా వేసిన హైకోర్టు**

**అమరావతి, జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై నిన్న హైకోర్టులో విచారణ జరిగింది. సింగయ్య మృతి కేసులో తమపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టివేయాలని వైఎస్ జగన్‌తో సహా పలువురు వైసీపీ నేతలు హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తుపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. నిన్నటి విచారణ సమయంలో వాదనలు వినిపించేందుకు సమయం కావాలని ప్రభుత్వం తరపు న్యాయవాది కోరడంతో విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. కాగా, వైఎస్ జగన్ పల్నాడు పర్యటనలో వైసీపీ కార్యకర్త సింగయ్య ప్రమాదవశాత్తు కారు కిందపడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ ఘటనపై వైఎస్ జగన్‌తో పాటు కారు డ్రైవర్, పలువురు వైసీపీ నేతలను నిందితులుగా చేర్చి పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం

- జిల్లా అభివృద్ధిపై సమీక్ష
- ఇన్చార్జి మంత్రి నారాయణ వద్ద సమస్యలు ఏకరువు పెట్టిన ఎమ్మెల్యేలు
- టిట్కో ఇళ్లపై హామీ

**కాకినాడ, జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 365/430 కేటగిరి టిడ్కో గృహాలన్నటినీ వచ్చే డిశంబరు నాటికి పూర్తి చేసి లబ్ధిదారులుకు అప్పగించాలని జిల్లా ఇన్ చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టనాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరి నారాయణ అధికారులను ఆదేశించారు.బుధవారం మద్యాహ్నం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కాకినాడ జిల్లా సమీక్ష కమిటీ సమావేశం జిల్లా ఇన్ చార్జి మంత్రి పొంగూరి నారాయణ అధ్యక్షతన కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ప్రభుత్వ విప్ లు దాట్ల సుబ్బరాజు, యనమల దివ్య, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పాల్గొన్నారు. సమావేశంలో తొలుత జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గత సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను కమిటీకి వివరించారు. అనంతరం అంజెండా అంశాలలో తొలి అంశంగా జిల్లాలో జిరో పోవర్టీ, పి-4 కార్యక్రమ అమలు ప్రగతిని వివరిస్తూ, జిల్లాలో 1,02,450 బంగారు కుటుంబాలను గుర్తించగా, వచ్చే ఆగష్టు 15వ తేదీ నాటికి వీరిలో 80,158 కుటుంబాలను మార్గదర్శులు దత్తత స్వీకరించే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ధేశించిందన్నారు. స్వర్ణాంధ్ర పి4 కార్యక్రమం క్రింద ఈ నెల 17 నుండి ఆగష్టు 5వ తేదీ వరకూ గ్రామ, వార్డు సభలలో బంగారు కుటుంబాల వాలిడేషన్ నిర్వహిస్తామని, ఈ నెల 18, 19 తేదీలలో మాస్టర్ ట్రైనీలు, సర్వేయర్లకు శిక్షణా కార్యక్రమాలు, 21 నుండి ఆగష్టు 6వ తేదీ వరకూ బంగారు కుటుంబాల అవసరాల సర్వే నిర్వహించనున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లాలో 3,844 బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత స్వీకరించారని తెలియజేశారు. జిల్లాలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శులుగా సుమారు 10 వేల కుటుంబాలను దత్తత చేపట్టే కార్యక్రమం జరుగుతోందన్నారు. దీనిపై మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పి-4 కార్యక్రమంలో చైతన్యవంతమైన భాగస్వామ్యం వహించాలని కోరారు. వ్యవసాయ శాఖ పై చర్చలో జిల్లాలో 47 వేల మంది రైతులు 21,400 హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం చేపటేలా ప్రోత్సహించామన్నారు. 69 వేల మంది కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు జారీ చేసే లక్ష్యం చేపట్టి ఇప్పటి వరకూ 23,636 మందికి కార్డలు జారీ చేసామని, 1914 మంది రైతులు పంటరుణాలు పొందారని తెలిపారు. విద్యుత్ శాఖ సమీక్షలో జిల్లాలో పియం సూర్యఘర్ పథకం క్రింద ఇప్పటి వరకూ 6,218 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన 1799 రూఫ్ టాప్ యూనిట్లు స్థాపన జరిగిందని, పియం కుసుమ్ పథకం క్రింద రైతు వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ పవర్ ద్వారా 42.43 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసేందుకు 189.77 ఎకరాల స్థలం సేకరించామని కలెక్టర్ తెలిపారు. ఇరిగేషన్ సమీక్షలో ఏలేరు రిజర్వాయరులో తగినంత నిల్వలు లేని కారణంగా టైల్ ఎండ్ ప్రాంతాలకు నీరు చేరడంలేదని, ఆగష్టు 1 నుండి పురుషోత్తపట్నం, పుష్కర లిఫ్ట్ ల ద్వారా నీటిని ఏలేరు, పిబిసి కి సరపరా చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం గోదావరిలో జలాలు పెరిగినందున ఆగష్టు 1 వరకూ ఆగకుండా, వెంటనే నీటిని లిఫ్ చేస్తే రైతులు అదను దాటిపోకుండా నారుమళ్లు చేపడతారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. ఈ మేరకు సత్వరం నీటి సరఫరా చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని ఇన్ చార్జి మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ రూరల్ నియోజక వర్గ పరిధిలో 11 ఏళ్లగా ఎన్నికలు జరగని 7 గ్రామ పంచాయితీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక, సాధారణ నిర్వహణ కష్టం అవుతోందని, ఈ పంచాయితీలను కాకినాడ నగరంలో విలీనం చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. అలాగే స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ క్రింద చేపట్టి నిధుల లేక ఆగిపోయిన పలు పనులు పూర్తి చేయించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మంత్రిని కోరారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేస్తే నగరంలోని పారిశుద్యాన్ని మరింత మెరుగు పరచవచ్చునన్నారు. గృహ నిర్మాణ చర్చలో గత ప్రభుత్వం నిర్మాణానికి అనువుగా లేని స్థలాలు కేటాయించడం వల్ల చాలా మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేక పోయారని, వీటికి బదులు పోలవరం స్పోయిల్ లాండ్స్ లో స్థలాలు కేటాయించేందుకు పరిశీలిచాలని ఎమ్మెల్యేలు కోరారు. అలాగే ఆన్ లైన్ లో పేర్లు లేకపోయినా, ఎటువంటి స్థలం కేటాయించకుండా, అధికారుల కూడా తెలియకుండా, లబ్ధిదారులను మభ్యపెట్టి గత ప్రభుత్వ హాయాంలో జారీ చేసిన ఫేక్ పట్టాల అంశంపై ఎంక్వయిరీ చేయాలని కోరారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లు కట్టకుండానే లబ్ధిదారుల పేర 140 కోట్లు రుణాలు తీసుకుని డైవర్ట్ చేయడం వల్ల అవి బ్యాంకులకు ఎన్.పి.ఏ లుగా మారాయని, ఈ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం కట్టి, సగంలో ఆగిపోయిన 365/430 కేటగిరి ఇళ్లన్నిటినీ వచ్చే డిశంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యం చేపట్టిందని ఇన్ చార్జి మంత్రి తెలిపారు. మున్సిపల్ సమీక్షలో అన్ని పట్టనాలు ఎదుర్కొంటున్న డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేలు కోరారు. ఆలాగే ఆయా నియోజక వర్గాలలో ఎదురౌతున్న స్థానిక సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రి, కలెక్టర్ దృష్టికి తెచ్చి పరిష్కారాలను కోరారు. సమావేశంలో వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడెక్ట్ స్కీమ్ క్రింద పెద్దాపురం సిల్క్ చీర ఉత్పత్తులు ఎంపికైనందుకు అధికారులను, నేతన్నలను, రాష్ర స్థాయి యోగాంధ్ర పోటీలలో పతకాలు సాధించిన యోగ సాధకులను ఇన్ చార్జీ మంత్రి నారాయణ మంత్రి అభినందించారు. అనంతరం ఆయన ప్రెస్ మీట్ నిర్వహించి సమావేశంలో చర్చించిన అంశాలను మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, పిఠాపురం నియోజక వర్గ జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.







# జి ఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవను కలిసిన ఎంపీ పురంధేశ్వరి

**రాజమహేంద్రవరం, జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సికింద్రాబాద్ రైల్వే నిలయంలో రాజమహేంద్రవరం ఎంపీ శ్రీమతి పురంధేశ్వరి తో కలిసి , బిజెపి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులుపిక్కి నాగేంద్ర కొవ్వూరు బిజెపి మున్సిపల్ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ , బిజెపి నాయకులు ఉన్నికృష్ణన్ తదితరులు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ ను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కొవ్వూరు రైల్వే స్టేషన్ లో రైళ్ల హాల్టింగ్స్ గురించి చర్చించడం జరిగింది. కొవ్వూరు రైల్వే స్టేషన్ లో పూర్వ రైళ్ల హాల్టింగ్స్ ను పునరుద్ధరణ చేయాలని పురంధేశ్వరి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. బిజెపి నాయకుల ప్రతిపాదనలకు జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, పిల్లలమర్రి మురళీకృష్ణ, ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ, కొవ్వూరు పరిసర ప్రాంతాల ప్రజలు కొవ్వూరు రైల్వే స్టేషన్ లో కోవిడ్ పూర్వ రైళ్ల హాల్టింగ్స్ లేకపోవడం వలన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఈ విషయాన్ని రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి జి ఎం సంజయ్ కుమార్ వివరించామన్నారు. వివిధ కారణాల తో రైళ్ల హాల్టింగ్స్ పునరుద్ధరణ చేయకపోవడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పురంధేశ్వరి జి ఎం కి తెలిపారన్నారు. రైల్వే అధికారులందరూ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే రైళ్ల హాల్టింగ్స్ సాధిస్తామన్నారు.

**బాల ఆధార్ అప్ డేట్**

# చేయకుంటే రద్దు..

**యూఐడీఏఐ హెచ్చరిక**




**అమరావతి, జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బాల ఆధార్.. చిన్నారుల కోసం భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ప్రత్యేకంగా కేటాయిస్తున్న విషయం తెలిసిందే. కేవలం ఫొటో, పేరు వివరాలతో జారీ చేసే ఈ కార్డును చిన్నారులకు ఐదేళ్లు దాటాక అప్ డేట్ చేయించాల్సి ఉంటుంది. తాజాగా ఈ విషయంపై ఆధార్ జారీ సంస్థ యూఐడీఏఐ కీలక సూచన చేసింది. ఐదేళ్లు దాటిన తర్వాత బాల ఆధార్ ను అప్ డేట్ చేయాలని, లేదంటే ఆ కార్డు రద్దవుతుందని హెచ్చరించింది. బాల ఆధార్ పొందిన చిన్నారులకు ఐదేళ్లు దాటిన తర్వాత తప్పనిసరిగా వేలిముద్రలు, కనుపాపలు, ఫొటో అప్‌డేట్ చేయాలని చెప్పింది. ఏడేళ్లు దాటినా కూడా అప్ డేట్ చేయకుంటే సదరు బాల ఆధార్ రద్దవుతుందని స్పష్టం చేసింది. ఈమేరకు బాల ఆధార్ జారీ సమయంలో ఇచ్చిన ఫోన్ నెంబర్ కు ఈ విషయంపై అలర్ట్ మెసేజ్ లు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, ఐదేళ్లు దాటిన, ఏడేళ్లలోపు పిల్లలకు చెందిన బాల ఆధార్ అప్ డేట్ పూర్తిగా ఉచితమని చెప్పారు. ఏడేళ్లు దాటిన పిల్లలకు ఆధార్ అప్ డేట్ చేయడానికి రూ.100 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

# విజయవాడలో జంట హత్యల కలకలం

**నగర నడిబొడ్డున ఇద్దరు యువకుల దారుణ హత్య**

**ఇద్దరు యువకులను కత్తితో పొడిచి హతమార్చిన రౌడీషీటర్**

**గవర్నర్‌పేటలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలో ఘటన**

**విజయవాడ జులై 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

విజయవాడలో జంటహత్యలు కలకలం రేపాయి. నగర నడిబొడ్డున ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులను ఓ వ్యక్తి పొడిచి పరారైనట్లు సమాచారం. రక్తపు మడుగులో పడి ఉన్న రెండు మృతదేహాలు చూసి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన గవర్నర్‌పేటలోని అన్నపూర్ణ థియేటర్ సమీపంలో చోటుచేసుకుంది. మృతులు ఇద్దరూ విజయనగరం జిల్లాకు చెందిన వారిగా తెలుస్తోంది. వారు క్యాటరింగ్ పనుల కోసం వచ్చి, అన్నపూర్ణ థియేటర్ సమీపంలో అద్దె గదుల్లో ఉంటున్నట్లు సమాచారం. స్థానికుల ద్వారా ఈ జంట హత్యలపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఓ రౌడీషీటర్ ఆ ఇద్దరు యువకులను కత్తితో పొడిచి హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.






డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

గురువారం 17 జులై 2025

# డోల బాల వీరాంజనేయ స్వామి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఆనందరావు







**అమలాపురం జూలై 16 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** అమలాపురం నియోజకవర్గానికి విచ్చేసిన సాంఘిక సంక్షేమ శాఖ విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సచివాలయముల మరియు వాలంటీర్ల శాఖామాత్యులు డోల బాల వీరాంజనేయ స్వామి గారికి దుశ్శాలువ కప్పి సాదరంగాస్వాగతం పలికిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర sc సెల్ ఉపధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, అమలాపురం రూరల్ టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, మాజీ zptc దేశంశెట్టి లక్ష్మీనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు

# గురుకులాల్లో ఇంటి వాతావరణం కల్పించడమే లక్ష్యంగా కృషి: సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల ఆంజనేయ స్వామి

## -గురుకులలో పలు శంకుస్థాపన కార్యక్రమాలు..





**అల్లవరం, జులై 16(తెలుగు రాష్ట్రం విలేఖరి):** షెడ్యూల్ కులాల విద్యార్థినీ విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాలలో ఇంటి మాదిరిగా చదువుకునే వాతావరణాన్ని కల్పించి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం అహర్నిశలు పాటుపడు తుందని ఆ దిశగా లక్షిత వర్గాల వారు ఈ యొక్క అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన పౌరులుగా ఎదగాలని సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల ఆంజనేయ స్వామి తెలిపారు. బుధవారం అల్లవరం మండల పరిధిలోని గోడి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర బాలికల పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థినీ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అన్ని రకాల వసతులను సమాకుర్చడం జరుగుతోందని వాటిని సద్వినియోగం చేసుకొని ఉత్తమమైన పౌరులుగా జీవించాలని ఆకాంక్షించారు. వసతి గృహాలలో వసతులు మెనూ, ఆహార నాణ్యత పరిశుభ్రత, సురక్షితమైన త్రాగునీరు సరఫరా, నాణ్యమైన విద్యాబోధన, తదితర అంశా లపై ఆరా తీశారు. బాలికల వసతి గృహం జ్ఞాన మందిరం వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి శంకు స్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. క్రీడా ప్రాంగణం నందు బాస్కె ట్బాల్ కోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విద్యాపరంగా ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని క్షేత్రస్థాయి నుండి విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు ఈ యొక్క అవకాశాలను పునాదిగా చేసుకుని రాణించాలని మంత్రి అభిలసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు, పెచ్చెట్టి చంద్రమౌళి,



దెందుకూరి సత్తిబాబు రాజు, సర్పంచ్ తోట శ్రీదేవి నరసింహారావు, మెట్ల రమణబాబు, ఆమూడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఆర్డీవో కే మాధవి తాసిల్దార్ నరసింహారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న భక్తులకు అధిక ప్రాధాన్యత

## - సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు



**ఆత్రేయపురం, జూలై 16, (తెలుగు రాష్ట్రం విలేఖరి):** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి ప్రతీ శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులకు సూచించారు. గత శనివారం అధిక సంఖ్యలో 70 వేలకు పైగా భక్తులు తరలి వచ్చిన నేపథ్యంలో మంగళవారం కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, తహశీల్దార్ టి.ఆర్. రాజేశ్వరరావు, ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పార్కింగ్ స్థలాలు, రోడ్లు పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో క్యూలైన్ల పెంపు, భక్తులకు అవసరమైన తాగునీరు తదితర సౌకర్యాలు ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుపై వైద్యాధికారులకు, భద్రత తదితర అంశాలపై పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వచ్చిన ప్రతి భక్తుడు స్వామివారిని కనులారా దర్శించి మనో సంతృప్తితో వెళ్లాలన్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# తల్లికి వందనం పథకం అర్హులందరికీ అందించాలి

## - జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి





**అమలాపురం, జూలై 16,, (తెలుగు రాష్ట్రం విలేఖరి): :** భూ యాజమాన్యాల (జాయింట్ ఎల్.పి.ఎం) భూములను విభజించితల్లికి వందనం పథకం లబ్ధిని అర్హులందరికీ చేకూర్చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సర్వే సిబ్బందిని ఆదేశించారు. బుధవారం అమరావతి నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, భూ పరిపాలన కమిషనర్ ఎన్. ప్రభాకర్ రెడ్డిలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆమె పాల్గొన్నారు. జాయింట్ ఎల్పీఎంలు విభజన, అందరికీ ఇళ్ళు, రీ వెరిఫికేషన్ ఆఫ్ అవుట్ సైడ్, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఎస్సీ ఎస్టీ గ్రామాల్లో బరియల్ గ్రౌండ్ కు స్థల సేకరణ, రీ సర్వే అంశాల పురోగతిపై వారాంతపు సమీక్షలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్లతో జిల్లాల వారీగా నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ గ్రామాల్లో బరియల్ గ్రౌండ్ విస్తీర్ణాలను ఆరా తీసి ఎంత విస్తీర్ణం మేర ఉన్నది నివేదిక సమర్పించాలన్నారు. అర్హులందరికీ ఇళ్లకు సంబంధించి లేఔట్ల లోని ఇప్పటివరకు లబ్ధిదారులకు పంపిణీ చేయని ఖాళీ జాగాలను గుర్తించి వాటిని అర్హుల అభీష్టానికి అనుగుణంగా పంపిణీ చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాల ఆర్థిక లబ్దిని అర్హులందరికీ చేకూర్చే దిశగా భూ సమస్యల పట్ల అధికారులు తక్షణమే స్పందించి అర్హులకు న్యాయం చేకూర్చాలన్నారు. రీ సర్వేకు సంబంధించి నూటికి నూరు శాతం నోటిఫికేషన్లు జారీ చేయాలన్నారు. రీ సర్వే ప్రక్రియపై ఐవిఆర్ఎస్ ప్రజాభిప్రాయ పోర్టల్ ద్వారా ఎటువంటి అవినీతి ఆరోపణలు ఉత్పన్నం కాకుండా సిబ్బంది జవాబుదారితనంతో అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కే.ప్రభాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి. బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో సూర్య ఘర్ యోజనపై సమీక్ష



**అమలాపురం, జూలై 16 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకముపై అమలాపురం మున్సిపల్ కమీషనర్ వి.నిర్మల్ కుమార్ బుధవారం ఉదయం పురపాలక సంఘ కార్యాలయంలోని కమీషనర్ చాంబరులో సచివాలయం కార్యదర్శులకు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా లబ్దిదారులకు కలిగే ప్రయోజనాలు గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ లను లబ్దిదారులు ఏర్పాటు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 78000 వరకు సబ్సిడీని పొందవచ్చునని, ఎస్సీ, ఎస్టీ వారికి ప్రభుత్వమే ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేస్తుందని, మిగిలిన వారికి తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. అమలాపురం పురపాలక సంఘం పరిధిలో ఉన్న గృహ యజమానులకు ఈ పథకం గురించి, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ గురించి వార్డు సెక్రటరీలు అందరు సమగ్రంగా వివరించి, వచ్చే రెండు రోజులలోని ఆసక్తి ఉన్న లబ్దిదారులను ఎంపిక చేసి, వారి వివరములను పురపాలక సంఘ కార్యాలయమునకు అందజేయాలని కమీషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఈపిడిసిఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.అన్నవరం, సోలార్ రూఫ్ టాప్స్ ను ఏర్పాటు చేసే ఏజెన్సి ప్రతినిధులు పాల్గొని, ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం యొక్క ప్రయోజనాలు, ఏర్పాటు చేసుకునే విధానాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఈఈ కె.వి.వి.సత్యనారాయణ, టిపిఓ శ్రీమతి రాణీ సంయుక్త, ఏఈ కె.వెంకటేష్, గవర్నమెంట్ వెండర్ ఆజాద్ నాగసుధ కొండ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

# సొసైటీ అభివృద్ధికి కృషి చేసి రైతులకు అండగా నిలుస్తా : దేవగుప్తం సొసైటీ అధ్యక్షులు వేగిరాజు

## -వేగిరాజు వెంకటరాజు అభినందించిన మంత్రి వీరాంజనేయ స్వామి ఎమ్మెల్యే ఆనందరావు



**అల్లవరం,జులై16(తెలుగు రాష్ట్రం విలేఖరి):** దేవగుప్తం వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ రైతులకు అండగా నిలుస్తానని నూతన అధ్యక్షులు వేగిరాజు వెంకట సత్యనారాయణ రాజు అన్నారు. కూటమి నాయకులు అభిమానులు మధ్య దేవగుప్తం సొసైటీ అధ్యక్షులుగా వేగిరాజు వెంకట సత్యనారాయణ రాజు, సొసైటీ డైరెక్టర్లుగా చిట్టూరి శ్రీనివాస్, నల్లా నాగరాజు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ వికలాంగుల మరియు సీనియర్ సిటిజన్ సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వేగిరాజు వెంకట సత్యనారాయణ రాజుకు పూలమాలలు వేసి దుస్సాలువాలు కప్పి అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు తెలుగుదేశం సీనియర్ నాయకులు మెట్ల రమణబాబు , అమూడ చైర్మన్ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, సర్పంచ్ సాధనాల వెంకట్రావు, ముత్యాల బాబి, పాండురంగారావు, కంకిపాటి గోపి, జంగా బుజ్జి ,కల్వకొలను తాతాజీ, లింగోలు పండు, పోతుల సుభాష్ చంద్రబోస్, యాళ్ల నాగ సతీష్ , దేశంశెట్టి లక్ష్మీనారాయణ, గుబ్బల నాగేశ్వరావు, గునిశెట్టి చినబాబు, కంకిపాటి వీరబాబు, లింగోలు పండు , డాక్టర్ నాగ మానస , అయితాబత్తుల అజయ్, రొక్కల నాగేశ్వరరావు, పోతుల నాగరాజు, బడుగు రాంబాబు ముత్తాబత్తుల రాంబాబు, కొల్లు విష్ణు, కొల్లు త్రిమూర్తులు, పోతుల నాగలక్ష్మి అప్పారావు, పోతుముడి సురేష్, అధిక సంఖ్యలో కూటమి నాయకులు ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొని వేగిరాజు వెంకటరాజుకు అభినందనలు తెలియజేశారు.

# రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న కూటమి ప్రభుత్వం

## -కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆలమూరు, జూలై 6(తెలుగు రాష్ట్రం విలేఖరి):** కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. బుధవారం ఆలమూరు మండలం చింతలూరు, సూర్యారావు పేట గ్రామాల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అధికారంలోకి రాగానే ఒకేసారి పింఛను మొత్తాన్ని రూ.వెయ్యి పెంచిన అంశాన్ని ప్రజలకు వివరించారు, తల్లికి వందనం పథకంలో ఇంటిలో ఉన్న పిల్లలందరికీ నగదు జమ చేసామన్నారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు అవుతుందని తెలిపారు. ఆ తరువాత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో సాగుతుందన్నారు. ఏడాదిలో జరిగిన అభివృద్ధిని మించిన అభివృద్ధి మరో నాలుగేళ్లలో జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రజాప్రభుత్వాన్ని ప్రతీ ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, మెర్ల గోపాలస్వామి, దండంగి మమత, ఒంటిపల్లి సతీష్, రామానుజుల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## శిక్షణా తరగతుల్లో బిఎల్వోలు



**పోలవరం, జూలై16 (తెలుగు రాష్ట్రం విలేకరి):** పోలవరం తహశీల్దారు కార్యాలయంలో పోలవరం మండలంలో బూత్ స్థాయి అధికారులకు డిప్యూటీ తహశీల్దారు కంభంపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీ శిక్షణా తరగతుల్లో శిక్షణ పొందిన ప్రత్యేక అధికారి ప్రవీణ్ బూత్ స్థాయి అధికారులకు వారి విధులు, విధుల నిర్వహణలో నైపుణ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలవరం మండల రెవెన్యూ సిబ్బంది వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలరాజు



**పోలవరం, జూలై 16 (తెలుగు రాష్ట్రం విలేకరి):** మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ప్రజలు హాజరై తమ సమస్యలను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు చిర్రి బాలరాజు ప్రజల నుండి అర్జీలను స్వీకరించి, తక్షణ పరిష్కారం అవసరమైన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, నాయకులు కుమార్ నాయుడు పాల్గొన్నారు.


## గైనకాలజిస్ట్ లేక గర్భిణీల అవస్థలు

**పోలవరం, జూలై16(తెలుగు రాష్ట్రం విలేకరి):**




పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు లేకపోవడంతో మండలంలో పలు ప్రాంతాలనుండి ప్రసవం కోసం వస్తున్న గర్భిణీలు స్త్రీల సమస్యలతో వస్తున్న రోగులు అవస్థలకు గురవుతున్నారు.గత్యంతరం లేక అక్కడి వైద్యులు గర్భిణీలను ప్రసవం కోసం రాజమహేంద్రవరం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రులకు సిఫార్సు చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. గత ఏడాదిన్నర క్రితం కాంట్రాక్టు పద్దతిన విష్ణువర్థిని అనేగైనకాలజిస్టుని ఈ ఆసుపత్రిలో విధుల నిర్వహణకు నియమించారు. ఏడాదిన్నర కాలంలో ఎలాంటి క్లిష్టమైన ప్రసవ కేసులనైనా ఆమె స్వయంగా ఆపరేషన్లు నిర్వహించి ప్రసవాలు చేసేవారు దీంతో పోలవరం పరిసర ప్రాంతాల ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు కూడా పోలవరంలో ప్రసవాలు చేసుకునేవారు. ఈ ఏడాది మే నెలలో ఏజన్సీ ప్రాంత గిరిజన గర్భిణీ మహిళ ప్రసవ సమయంలో పరిస్థితి విషమించి మృతి చెందడంతో విధుల నిర్వహణలో అలసత్వం వహించారని ఆమెపై క్రమ శిక్షణ చర్యలు తీసుకుని సస్పెండ్ చేశారు అంతేగాక గత నాలుగు నెలలుగా ఆమెకు జీతం కూడా ఇవ్వలేదు. నిజానికి సంఘటన జరిగిన రోజు ఆమె విధులలో లేదని ఆమె లేని సమయంలో జరిగిన మృతికి ఆమెను భాద్యురాలిని చేసి క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడం అన్యాయమని సాటి వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న గైనకాలజిస్టు పోస్టుని తక్షణమే భర్తీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారులు



**రాజవొమ్మంగి, జూలై 16 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** లాగరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులుగా ఎం. సతీష్ శరత్ చంద్రను ప్రభుత్వం ఇటీవల నియమించింది. వీరు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీరికి వైద్యాధికారులకు ఆసుపత్రి సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. రోగులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వైద్య సహాయం అందజేస్తామని వారు తెలిపారు.

## ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తాం -ఎమ్మెల్యే అమిలినేని




**కళ్యాణదుర్గం, జులై 16 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం రాంపురం గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కంబదూరు మండలం రాంపురం గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఇప్పటివరకు అందించిన సంక్షేమ పథకాలు, వారికి ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, పార్టీ అబ్జర్వర్ నాగేశ్వర యాదవ్ , మండల పార్టీ నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులు వినతి మేరకు గ్రామంలో త్వరలోనే ఆర్వో ప్లాంట్ నిర్మించి మంచినీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలో ఐదు తరగతి లకు కేవలం రెండు భవనాలు ఉన్నాయని ఉపాధ్యాయులు తెలుపగా తాత్కాలికంగా బయట ఉన్న స్థలంలో షెడ్డు నిర్మించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఒకే కుటుంబంలో ఏడు మంది కుమార్తెలు ఉన్నారని తండ్రి చనిపోయారని చెప్పగా అన్ని రకాలుగా ఆదుకుంటామని కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఒక్కో ఇంట్లో నలుగురు, చదువుతున్న కుటుంబాలకు కూడా తల్లికి వందనం 100% వచ్చిందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వారి ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా సమస్యలు తెలుసుకునేందుకు ఇంటింటికి వెళుతుంటే ఎమ్మెల్యే అధికారులతో కలిసి తమఇంటి దగ్గరికి వచ్చి సమస్యలు తెలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో పర్యటిస్తామని తెలిపారు.

## వాహనాలను తనిఖీ చేసిన ఎస్సై నరసింహమూర్తి



**రాజవొమ్మంగి, జూలై 16 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ప్రధాన రహదారుల్లో వాహనాలను బుధవారం పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ నరసింమూర్తి మాట్లాడుతూవాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు వాహనంలో తప్పనిసరిగా ఉంచుకోవాలని ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించరాదని, లైసెన్సు లేని మైనార్టీ తీరని పిల్లలకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని రాజవొమ్మంగిలోని ప్రధాన కూడళ్ళలో వాహనతనిఖీలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

## సుపరిపాలనలో తొలి అడుగులో ఎమ్మెల్యే



**గోపాలపురం, జూలై 16 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** సుపరిపాలన తొలి అడుగు మండల పరిధిలోని నల్లజర్ల గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇంటింటి కి తిరిగి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్



**జగ్గయ్యపేట, జూల్కె 16 (తెలుగురాష్ట్రం విలేఖరి):** పట్టణం లోని బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ మానవత్వం చాటుకున్నారు. పట్టణానికి చెందిన యూనియన్ సభ్యుడు గంధం కొండలు ఇటీవల కాలంలో మరణించారు. మరణించిన రెండో రోజు గంధం కొండ ఇంటిలోని గ్యాస్ లీక్ అయి మంటలు అంటుకొని ఇంట్లోని ఫ్రిడ్జ్ బీరువా మొదలైన వస్తువులు అగ్నికి అహుతి అయి ఆర్థికంగా నష్టపోయారు. విషయం తెలుసుకున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ వారు అధ్యక్షులు నీలకంత శివప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యుల వద్ద నుండి విరాళాలు సేకరించారు. బుధవారం గంధం కొండ కుటుంబ సభ్యులను పరామర్శించి సేకరించిన విరాళాలను నగదు 25, 000 రూపాయలు ఒక క్వింటా బియ్యం అందించారు. డ్రిల్లింగ్ కాజా 5000 రూపాయల నగదు 25 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నీలకంఠ శివప్రసాద్, కార్యదర్శి వేముల శ్రీను, చిట్యాల మల్లయ్య, డ్రిల్లింగ్ కాజా చెక్కు నాగేశ్వరరావు, నాగరాజు, పర్వతం భాస్కర్, వీర్ల శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## సరుకు రవాణా సంబంధించి నియంత్రణ ఉండాలి-ఎమ్మెల్యే రోషన్ కుమార్



**చింతలపూడి, జూలై 16 ( తెలుగు రాష్ట్రం విలేఖరి):** భారీ వాహనాల రాకపోకలు మరియు పరిమితులకు మించి సరుకు రవాణా తదితర అంశాలపై రవాణ శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించాలని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం ఏలూరు లోని గౌతమి మీటింగ్ హల్ వద్ద జిల్లా ట్రాన్స్పోర్ట్ కమిషనర్, రవాణాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. వాహన చట్ట ప్రకారం నియమ నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే సూచించారు.

## కూటమి పాలనలో సంక్షేమం అభివృద్ధి

### -ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు



**పోలవరం, జూలై 16 (తెలుగు రాష్ట్రం విలేకరి):** బుట్టాయగూడెం మండలం నిమ్మలగూడెం పంచాయతీ నిమ్మలగూడెంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొరగం శ్రీనివాసులు నాయకులు కార్యకర్తలతో కలిసి డోర్ టూ డోర్ కార్యక్రమంలో భాగంగా నేరుగా ప్రజల వద్దకు వెళ్ళి కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మ నాగు, బిర్ర నాగభూషణం,మొడియం సింగరాజు, చిట్టిబాబు, కనకరావు, పాయం అరుణ్ కుమార్, చోడెం అర్జున్, చోడెం ప్రసాద్, దెయ్యాల కృష్ణమోహన్, బిర్రం వినష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధి కార్మికులు



**రాజవొమ్మంగి, జూలై 16 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** మండల పరిధిలో 6 నెలల క్రితం ఈసీగా వచ్చిన ఉపాధి ఇంజనీరింగ్ కన్సల్ టెస్ట్ రాజబాబు శ్రామికులకు సరైన వేతనం చెల్లించడం లేదని, అసాంఘిక కార్యక్రమాలు చేపడుతూ గిరిజన మహిళలను ఎంతో వేదనకు గురి చేస్తున్నారని, ఉపాధి హామీ బిల్లులు సరిగా ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ఎంపీడీవో యాదగిరి ఈశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, దండకారణ్య సమితి సౌత్ రీజన్ ఉపాధ్యక్షులు వంతు బాలకృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



# నేటి నుంచే భారత్-ఇంగ్లాండ్ మహిళల వన్డే సిరీస్..

## టీ20ల్లో గెలిచిన జోరు కొనసాగిస్తారా?

**టీ20 సిరీస్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి చరిత్ర సృష్టించిన భారత మహిళల క్రికెట్ జట్టు ఇప్పుడు అదే జోరుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. బుధవారం, జూలై 16, 2025న సౌతాంప్టన్‌లోని ది రోజ్ బౌల్ స్టేడియంలో తొలి వన్డే జరగనుంది. ఈ సిరీస్ భారత్‌కు చాలా కీలకం, ఎందుకంటే ఈ ఏడాది చివర్లో స్వదేశంలో జరగబోయే ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌కు ఇది ఒక సన్నాహక మ్యాచ్‌లా ఉపయోగపడనుంది. టీ20 సిరీస్‌ను 3-2తో గెలిచి అద్భుతమైన ఫామ్‌లో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టు వన్డేల్లో కూడా అదే విజయాన్ని కొనసాగించాలని చూస్తోంది.**



గత మే నెలలో శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో జరిగిన ట్రై సిరీస్‌ను భారత్ గెలుచుకుంది. ఆ సిరీస్‌లో భారత జట్టు దూకుడుగా ఆడి, 276, 275, 337, 342 వంటి భారీ స్కోర్లు సాధించింది. ఈ మార్పుపై కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. తాము ఇప్పుడు వన్డేల్లో నిలకడగా 300ం పరుగులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది బౌలర్లకు మరింత వెసులుబాటు కల్పిస్తుందని చెప్పారు. అలాగే, టీ20 సిరీస్‌లో స్పిన్నర్లను ఎక్కువగా ఉపయోగించడం వల్ల మధ్య ఓవర్లలో ప్రత్యర్థులకు కష్టం అయ్యిందని తెలిపారు.

భారత జట్టులో అత్యంత ఆసక్తికరమైన అంశం ప్రతీక్ రావెల్ మెరుపులు. సీనియర్ షఫాలీ వర్మను పక్కన పెట్టి మళ్ళీ జట్టులో చోటు దక్కించుకున్న రావెల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. ఆమె ఇటీవల మహిళల వన్డేలలో వేగంగా 500 పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించారు. ఆమెతో పాటు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, వికెట్ కీపర్ రిచా ఘోష్ మిడిల్ ఆర్డర్‌లో ఉన్నారు. దీప్తి శర్మ, అమన్‌జ్యోత్ కౌర్ వంటి ఫినిషర్లు ఉండడం జట్టు బలాన్ని మరింత పెంచుతోంది.

టీ20 సిరీస్ ఓటమి తర్వాత ఇంగ్లాండ్ జట్టులో ఇద్దరు కీలక ఆటగాళ్లు తిరిగి వచ్చారు. గాయం కారణంగా టీ20 సిరీస్ చివరి మూడు మ్యాచ్‌లకు దూరమైన కెప్టెన్ నాట్ స్కివర్-బ్రంట్ తిరిగి ఫిట్‌నెస్ సాధించి జట్టును నడిపించనున్నారు. అలాగే, మోకాలి గాయం కారణంగా వెస్టిండీస్ సిరీస్‌కు దూరమైన ప్రపంచ నంబర్ 1 వన్డే బౌలర్ సోఫీ ఎక్లెస్టోన్ కూడా జట్టులోకి వచ్చారు. భారత్ మహిళల జట్టు, ఇంగ్లాండ్ మహిళల జట్టు మధ్య జరిగే ఈ వన్డే సిరీస్‌ను సోనీ స్పోర్ట్స్, ఫ్యాన్ కోడ్ యాప్‌లలో బుధవారం, జూలై 16న ప్రత్యక్షంగా చూడవచ్చు.

భారత్ ప్లేయింగ్ XI భారత్: ప్రతీక్ రావెల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమన్‌జ్యోత్ కౌర్, దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, శ్రీ చరణి, క్రాంతి గౌడ్.

ఇంగ్లాండ్: టామీ బ్యూమాంట్, మైయా బౌషియర్, నాట్ స్కివర్-బ్రంట్ (కెప్టెన్), అలిస్ క్యాప్సీ, సోఫియా డన్‌క్లీ, అమీ జోన్స్ (వికెట్ కీపర్), చార్లీ డీన్, సోఫీ ఎక్లెస్టోన్, లారెన్ బెల్, కేట్ క్రాస్, లారెన్ ఫిల్లర్.

# మూడు పెళ్లిళ్లు.. అన్నీ ఫెయిల్యూర్‌లు..

## భార్యతో ఏకంగా ప్రైవేట్ వీడియో లీక్ చేసిన క్రికెటర్!



**శ్రీలంక మాజీ కెప్టెన్, ప్రపంచ క్రికెట్‌లో సంచలనం సృష్టించిన సనత్ జయసూర్య పేరు తెలియని వారుండరు. తన విధ్వంసక బ్యాటింగ్‌తో క్రికెట్ ప్రపంచాన్ని కొత్త పుంతలు తొక్కించాడు. అలాగే, తన స్పిన్ బౌలింగ్‌తో ఎన్నో కీలక వికెట్లు తీసి జట్టుకు విజయాలు అందించాడు. 1996లో శ్రీలంక ప్రపంచ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, ఆయన క్రికెట్ కెరీర్ ఎంత గొప్పగా ఉందో, ఆయన వ్యక్తిగత జీవితం అంతగా గందరగోళంగా ఉంది. 56 ఏళ్ల జయసూర్య మూడు పెళ్లిళ్లు చేసుకున్నారు. కానీ, ఆ మూడు బంధాలు విఫలమయ్యాయి. ముఖ్యంగా, మూడో భార్యతో ఆయనకు ఎదురైన అనుభవం ఆయన జీవితంలో ఒక వివాదాస్పద అధ్యాయాన్ని మిగిల్చింది.**

జయసూర్య తొలిసారి 1998లో ఎయిర్ శ్రీలంకలో గ్రౌండ్ హోస్టెస్‌గా పనిచేస్తున్న సుముద్ కరుణానాయకేను పెళ్లి చేసుకున్నారు. కానీ ఈ బంధం కొన్ని నెలల్లోనే తెగిపోయింది. తన క్రికెట్ కెరీర్‌కు ఈ పెళ్లి అడ్డంకిగా మారిందని, తన భార్య తనను వదిలేసిందని జయసూర్య అప్పట్లో మీడియాకు చెప్పాడు. ఈ విడాకుల వల్ల తాను చాలా ఇబ్బందులు పడ్డానని కూడా వెల్లడించాడు.

తొలి పెళ్లి విఫలమైన తర్వాత, జయసూర్య 2000లో సాండ్రా డిసిల్వా అనే ఫ్లైట్ అటెండెంట్‌ను రెండో వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు %-% సావింది, యాలిండి, రోనక్ %-% జన్మించారు. కానీ ఈ బంధం కూడా ఎక్కువ కాలం నిలబడలేదు. 2012లో ఈ ఇద్దరు విడిపోయారు. ఆ సమయంలో జయసూర్యకు మరో మహిళతో అక్రమ సంబంధం ఉందని మీడియాలో వార్తలు వచ్చాయి.

రెండో భార్యకు విడాకులు ఇచ్చిన తర్వాత, జయసూర్య నటి, మోడల్ అయిన మలికా సిరిసేనను సీక్రెట్ గా పెళ్లి చేసుకున్నాడు. 2012 ఫిబ్రవరిలో మౌంట్ లావినియాలోని ఓ బౌద్ధ ఆలయంలో వీరి వివాహం జరిగింది. కానీ ఈ బంధం కూడా ఎక్కువ కాలం నిలబడలేదు. జయసూర్యను వదిలేసి మలికా మరో వ్యాపారవేత్తను వివాహం చేసుకుంది. దీంతో జయసూర్య తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు సమాచారం. 2017లో జయసూర్య, మలికాల ప్రైవేట్ వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ వీడియోను జయసూర్యనే లీక్ చేశాడని అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన జయసూర్య ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసింది.

వ్యక్తిగత జీవితం ఎలా ఉన్నా, జయసూర్య క్రికెట్ కెరీర్ మాత్రం అద్భుతంగా సాగింది. సనత్ జయసూర్య తన క్రికెట్ కెరీర్‌లో ఎన్నో రికార్డులు సృష్టించారు. 110 టెస్టుల్లో 6973 పరుగులు, 445 వన్డేల్లో 13430 పరుగులు చేశారు. వన్డేల్లో 28 సెంచరీలు చేసి, అంతర్జాతీయ క్రికెట్‌లో మొత్తం 440 వికెట్లు తీశారు. 2011లో క్రికెట్ నుంచి రిటైర్ అయ్యారు. అయితే, ఆయన వ్యక్తిగత జీవితంలో జరిగిన ఈ సంఘటనలు ఆయన లెజెండరీ కెరీర్‌పై ఒక మచ్చలా మిగిలిపోయాయి.

# జార్ఖండ్ ప్రభుత్వంలో ధోనీకి కీలక బాధ్యతలు?

**మహేంద్ర సింగ్ ధోనీ జార?ండ్ రాష్ట్రంలో క్రీడలు, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి సిద్ధమవుతున్నారు. అలాగే, శ్రావణి మేళాకు %ూx% చాట్‌బాట్, 2026 నాటికి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు డిజిటలైజేషన్ కానున్నాయి. ఈ కీలక పరిణామాలపై పూర్తి వివరాలను ఈ వార్తలో తెలుసుకుందాం.**



భారత క్రికెట్‌కు సరికొత్త నిర్వచనం ఇచ్చిన లెజెండ్ మహేంద్ర సింగ్ ధోనీ, ఇప్పుడు తన సొంత రాష్ట్రం జార్ఖండ్‌కు సరికొత్త దిశానిర్దేశం చేయడానికి రెడీ అయ్యారు. క్రీడలు, పర్యాటక రంగాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధోనీ సలహాలు, సహకారం తీసుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలోనే, రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ గవర్నెన్స్ వంటి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీను ఉపయోగిస్తూ, రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. జార?ండ్ తీసుకుంటున్న ఈ కీలక నిర్ణయాలు, రాష్ట్ర భవిష్యత్తును పూర్తిగా మార్చబోతున్నాయి.

జార్ఖండ్ క్రీడలు, పర్యాటక రంగాలను కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం మాజీ భారత క్రికెట్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ సహకారం కోరుతోంది. ఈ విషయంపై ధోనీ, ఆ రాష్ట్ర పర్యాటక, కళలు-సంస్కృతి క్రీడా శాఖ మంత్రి సుదివ్య కుమార్ తో భేటీ అయ్యారు. క్రీడా మౌలిక సదుపాయాలు, పర్యాటక సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు. ధోనీ అనుభవం, నిబద్ధతతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఈ విషయమై ధోనీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

జార్ఖండ్‌లోని దేవ్ ఘర్ జిల్లా యంత్రాంగం ఒక కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. జూలై 11 నుంచి ప్రారంభమైన శ్రావణి మేళాకు వచ్చే భక్తులకు సహాయం చేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ ను ప్రారంభించింది. ఒక లింక్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోగలిగే ఈ చాట్‌బాట్, దేవ్ ఘర్ చరిత్ర, ఆలయ విశేషాలు, అలాగే మేళా సమయంలో భక్తులకు అవసరమైన అన్ని రకాల సమాచారం (రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, హాస్పిటల్, ఎయిర్‌పోర్ట్ వంటి వివరాలు) అందిస్తుంది. అంతేకాకుండా, మేళా ప్రాంతంలో రద్దీని నియంత్రించడానికి, భద్రతను పెంచడానికి, ఫేషియల్ రికగ్నిషన్, హెడ్‌కౌంట్ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. జార్ఖండ్ ప్రభుత్వం తమ అన్ని కార్యాలయాలను 2026 జనవరి నాటికి పూర్తిగా డిజిటలైజ్ చేయాలని నిర్ణయించింది. ప్రధాన కార్యదర్శి అల్కా తివారీ ఆధ్వర్యంలో ఈ చర్యలు ప్రారంభమయ్యాయి. సాంప్రదాయ పద్ధతులను పక్కన పెట్టి, కార్యకలాపాలను పూర్తిగా టెక్నాలజీ బెస్డ్ 'ఈ-ఆఫీస్' సిస్టమ్ లోకి మార్చాలని చూస్తున్నారు. ప్రధాన కార్యదర్శి ఇప్పటికే ఈ-ఆఫీస్ లైట్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. గడువులోగా అన్ని శాఖల్లోనూ ఈ వ్యవస్థ ఎలాంటి లోపాలు లేకుండా పనిచేసేలా చూడాలని ఐటీ విభాగాన్ని ఆదేశించారు.

# బ్యాడ్ లక్ .. సిరాజ్‌కు సానుభూతి వ్యక్తం చేసిన కింగ్ చార్లెస్ III





లార్డ్స్ టెస్ట్‌లో ఇంగ్లాండ్ చేతిలో భారత్ ఓడిపోయింది. ఆ ఓటమి తర్వాత రోజు, భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్-కెప్టెన్ రిషబ్ పంత్ లండన్‌లోని సెయింట్ జేమ్స్ ప్యాలెస్‌లో కింగ్ చార్లెస్ IIIని కలిశారు. ఈ మీటింగ్‌లో కింగ్ చార్లెస్ III మన టీమిండియా బాగా ఆడిందని మెచ్చుకున్నారు.

లార్డ్స్ టెస్ట్‌లో ఇంగ్లాండ్ చేతిలో భారత్ ఓడిపోయింది. ఆ ఓటమి తర్వాత రోజు భారత క్రికెట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్-కెప్టెన్ రిషబ్ పంత్ లండన్‌లోని సెయింట్ జేమ్స్ ప్యాలెస్‌లో కింగ్ చార్లెస్ IIIని కలిశారు. ఈ మీటింగ్‌లో కింగ్ చార్లెస్ III టీమిండియా బాగా ఆడిందని మెచ్చుకున్నారు. ముఖ్యంగా, మూడో టెస్ట్ చివరి క్షణాల్లో మహ్మద్ సిరాజ్ ఎలా అవుట్ అయ్యాడో చూసి ఆయన ఆశ్చర్యపోయారు. కింగ్ చార్లెస్ IIIతో మీటింగ్ తర్వాత శుభ్‌మన్ గిల్ మీడియాతో మాట్లాడాడు. సిరాజ్ అవుట్ అయిన తీరుపై కింగ్ చార్లెస్ III బాధపడ్డారని గిల్ చెప్పాడు. ఇంగ్లీష్ మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం.. కింగ్ చార్లెస్ III ఆ మ్యాచ్ హైలైట్స్‌ను చూశారట.

గిల్ మాట్లాడుతూ.. "కింగ్‌ను కలవడం చాలా సంతోషంగా ఉంది. మేము చాలా విషయాలు మాట్లాడుకున్నాం. మా చివరి బ్యాట్స్‌మెన్ అవుట్ అయిన తీరు చాలా దురదృష్టకరమని ఆయన అన్నారు. బంతి స్టంప్‌లను తాకింది కదా, ఆ తర్వాత మేము ఎలా ఫీల్ అవుతున్నామని ఆయన అడిగారు. అది మాకు దురదృష్టకర మ్యాచ్ అని, అది ఏ వైపుకైనా వెళ్లగలిగేదని మేము ఆయనకు చెప్పాము. రాబోయే రెండు మ్యాచ్‌లలో మేము బాగా ఆడతామని ఆశిస్తున్నాం" అని గిల్ వివరించాడు. కింగ్ చార్లెస్ III మంగళవారం సెయింట్ జేమ్స్ ప్యాలెస్‌లో భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లకు ఆతిథ్యం ఇచ్చారు. గిల్ నేతృత్వంలోని పురుషుల జట్టు ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్ ఆడుతోంది. మహిళల జట్టు కూడా ప్రపంచ కప్ కోసం ఇంగ్లాండ్‌లో ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుతోంది. లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో, భారత్ 193 పరుగులు చేయాలి. కానీ, టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ త్వరగా అవుట్ అవ్వడంతో 82 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, రవీంద్ర జడేజా ఒంటరిగా పోరాడి 61 పరుగులు చేశాడు.

# రోహిత్, కోహ్లీ భవిష్యత్తుపై బీసీసీఐ కీలక ప్రకటన..అభిమానుల సందేహాలకు తెరదించినట్లేనా ?

**విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవిష్యత్తుపై అభిమానుల్లో ఉన్న సందేహాలకు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెరదించారు. 2027 ప్రపంచ కప్‌లో ఈ ఇద్దరు స్టార్ ప్లేయర్లు వన్డే క్రికెట్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే 2027వరల్డ్ కప్ ఆడుతారని స్పష్టం చేశారు.**





భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుండి సడన్‌గా రిటైర్ అవ్వడం అందరినీ షాక్‌కు గురిచేసింది. దీనితో వారి భవిష్యత్తుపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. ముఖ్యంగా, 2027లో జరగబోయే ప్రపంచ కప్‌లో ఈ ఇద్దరు స్టార్ ప్లేయర్లు ఆడతారా, లేదా అనే ప్రశ్న అభిమానుల మదిలో మెదిలింది. దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ఒక స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ ఇద్దరు ఆటగాళ్ల భవిష్యత్తుపై వివరణ ఇచ్చి, అభిమానుల సందేహాలకు తెరదించారు.

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుండి తప్పుకున్న తర్వాత వారి భవిష్యత్తుపై వస్తున్న వార్తలపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా లండన్‌లో మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. రోహిత్, విరాట్ ఇద్దరూ 2027 ప్రపంచ కప్‌లో ఆడటానికి రెడీగా ఉన్నారు, వారు వన్డే క్రికెట్‌కు అందుబాటులో ఉన్నారని తెలిపారు. "రోహిత్, విరాట్ లేని లోటు మాకు కనిపిస్తోంది. కానీ, టెస్ట్ క్రికెట్ నుండి రిటైర్ అవ్వాలనేది వారి వ్యక్తిగత నిర్ణయం" అని ఆయన అన్నారు.

రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. బీసీసీఐకి ఒక స్పష్టమైన విధానం ఉందని, దాని ప్రకారం ఏ ఆటగాడికి ఎప్పుడు, ఏ ఫార్మాట్ నుండి రిటైర్ అవ్వాలని చెప్పదని అన్నారు. రిటైర్మెంట్ అనేది పూర్తిగా ఆటగాళ్లపై ఆధారపడి ఉంటుంది. టెస్ట్ ఫార్మాట్ నుండి తప్పుకోవాలనే నిర్ణయం కూడా ఈ ఇద్దరు ఆటగాళ్లే తీసుకున్నారని ఆయన స్పష్టం చేశారు.

విరాట్ కోహ్లీ వయసు ప్రస్తుతం 36 ఏళ్లు. కోహ్లీ తన కెరీర్‌లో 302 వన్డే మ్యాచ్‌లు ఆడి 14181 పరుగులు సాధించాడు. ఇందులో 51 సెంచరీలు, 74 అర్ధ సెంచరీలు ఉన్నాయి. వన్డే క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్ గా కోహ్లీ ప్రపంచ రికార్డు సృష్టించారు. అలాగే, కోహ్లీ 123 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 9230 పరుగులు, 125 టీ20 మ్యాచ్‌లు ఆడి 4188 పరుగులు సాధించారు. రోహిత్ శర్మ వయసు ప్రస్తుతం 37 ఏళ్లు. రోహిత్ శర్మ 273 వన్డే మ్యాచ్‌లు ఆడి 11168 పరుగులు సాధించాడు. ఇందులో 32 సెంచరీలు, 58 అర్ధ సెంచరీలు ఉన్నాయి. వన్డే క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (264) సాధించిన రికార్డు రోహిత్ పేరిట ఉంది. రోహిత్ 67 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 4301 పరుగులు, 159 టీ20 మ్యాచ్‌లు ఆడి 4231 పరుగులు చేశారు. రోహిత్ కెప్టెన్‌గా భారత జట్టుకు 2024 టీ20 ప్రపంచ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్స్‌ను అందించాడు.

తెలుగురాష్ట్రం దినపత్రిక



శ్రీలీల



# కారణం లేకుండా విజయ్ ను టార్గెట్ చేస్తున్నారు

టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి తెలిసిందే. కేవలం తన సినిమాలతోనే కాకుండా రియల్ లైఫ్ యాటిట్యూడ్ తో కూడా మంచి పాపులారిటీని తెచ్చుకున్న విజయ్ కు ఎంత మంది ఫ్యాన్స్ ఉన్నారో, ఆయనపై నెగిటివ్ కామెంట్స్ చేస్తూ విమర్శలు చేసే వాళ్లు కూడా అంతే మంది ఉన్నారు. విజయ్ ఏం మాట్లాడినా దాన్ని విమర్శలు చేసే బ్యాచ్ కూడా ఒకటుందనే ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ నేపథ్యంలోనే విజయ్ దేవరకొండపై ఎక్కువ నెగిటివిటీ వస్తూ ఉంటుంది. తాజాగా టాలీవుడ్ నిర్మాత నాగ వంశీ ఈ విషయంపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో వస్తోన్న కింగ్‌డమ్ సినిమాకు నిర్మాత నాగ వంశీ. కింగ్‌డమ్ ప్రమోషన్స్ లో భాగంగా మీడియాకు ఇంటర్వ్యూలిస్తున్న నాగ వంశీ విజయ్ ను అసలెందుకు టార్గెట్ చేస్తున్నారో తెలియడం లేదని అన్నారు. ఇదంతా చూస్తుంటే విజయ్ ను ఉద్దేశపూర్వకంగనే టార్గెట్ చేస్తున్నారనిపిస్తుందని, రెట్రో ప్రీ రిలీజ్ ఈవెంట్ లో చేసిన కామెంట్స్ పై ఎదురైన వ్యతిరేకతకు విజయ్ బహిరంగంగా క్షమాపణలు చెప్పినప్పటికీ వివాదం ఇంకా కొనసాగుతూనే ఉందని, అందరూ ట్రోల్ చేస్తున్నట్టు విజయ్ అలాంటి వాడు కాదని వంశీ చెప్పారు. చిన్న వయసులో విజయ్ బోల్డ్ స్టేట్‌మెంట్స్ ఇచ్చేవాడనే విషయాన్ని తాను కూడా ఒప్పుకుంటానని, కానీ ఇప్పుడు విజయ్ చాలా కాన్ఫిడెంట్ గా మారాడని, ఎవరైనా విజయ్ తో పర్సనల్ గా మాట్లాడితే అతని గురించి తెలుస్తుందని నాగ వంశీ అన్నారు. విజయ్ ఏం మాట్లాడినా భూతద్ధంలో పెట్టి చూసి మరీ కాంట్రవర్సీ చేయడానికి ట్రై చేస్తున్నారని, ఇప్పుడు వాటన్నింటినీ దాటుకుని మరీ కింగ్‌డమ్ ఆడాలని, దానికి తామెంతో ఎఫర్ట్స్ పెట్టాలని నాగవంశీ అనగా, ఆయన చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక కింగ్‌డమ్ విషయానికొస్తే విజయ్ హీరోగా భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్ గా నటించిన ఈ సినిమా జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుండగా, అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

# బిగ్ బాస్ సీజన్9.. ఈసారి రూల్స్ మారాయి





బుల్లితెర రియాలిటీ షో బిగ్ బాస్ తిరిగి వచ్చేస్తుంది. ఇప్పటికే ఈ షో 8 సీజన్లు పూర్తి చేసుకోగా 9వ సీజన్ కు రంగం సిద్ధమవుతుంది. అయితే ఈసారి సీజన్ మునుపటిలా ఉండదని హోస్ట్ నాగార్జున ఇప్పటికే ప్రోమో ద్వారా క్లారిటీ ఇచ్చారు. ఈ సీజన్ లో సీక్రెట్ రూమ్స్, వైల్ కార్డ్ ఎంట్రీలు, రీఎంట్రీలు ఉండవని, సీజన్ 9 మొత్తం మైండ్ గేమ్స్, ఎమోషనల్ టెన్షన్స్ పైనే నడుస్తుందని చెప్పారు. బిగ్ బాస్ సీజన్8 టైమ్ లో కంటెస్టెంట్స్ ఫిజికల్ టాస్క్ లతో అలసిపోయారని, కొందరు అందులో చాలా ప్రెజర్ ఉందని కూడా ఆందోళన వ్యక్తం చేయడంతో ఈసారి బిగ్ బాస్ టీమ్ ఫిజికల్ టాస్క్ లను తగ్గించి సోషల్ బిహేవియర్, పర్సనాలిటీ, ప్రెజర్ లో ఉన్నప్పుడు ఎలాంటి డెసిషన్స్ తీసుకుంటారనే వాటిపై ఎక్కువ ఫోకస్ చేస్తున్నారని తెలుస్తోంది. దాంతో పాటూ ప్రతీ వారం ఇంటి నుంచి ఒక పార్టిసిపేట్ ను ఎలిమినేట్ చేయడానికి కూడా కొత్త పద్ధతిని అవలంభిస్తున్నట్టు తెలుస్తోంది. ఇవన్నీ బిగ్ బాస్ సీజన్9పై ఆసక్తిని పెంచేస్తున్నాయి. వీటితో పాటూ కంటెస్టెంట్ల లిస్ట్ ఆ ఇంట్రెస్ట్ ను ఇంకాస్త పెంచుతుంది. ఇప్పటికే నవ్య స్వామి, రీతూ చౌదరి, సుమంత్ అశ్విన్ పేర్లు బాగా వినిపిస్తున్నాయి. వీరితో పాటూ పలువురు సెలబ్రిటీలు, కామన్ పీపుల్ కూడా ఈసారి కొత్త సీజన్ లో భాగం కానున్నారు. ఓ రకంగా చెప్పాలంటే కామన్ పీపుల్ ను షో లో భాగం చేయడం కాస్త కష్టమే అయినా ఆ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సీజన్ 9కు మంచి బజ్ తీసుకురావచ్చు. ఎప్పటికప్పుడు బిగ్ బాస్ టీమ్ కొత్త సీజన్ ను మరింత కష్టంగా మారుస్తూ ఉంటుందనే సంగతి తెలిసిందే. ఈసారి సీజన్ ను ముందు సీజన్ కంటే మరింత కష్టతరంగా మార్చడానికి టీమ్ ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఆరు సీజన్లుగా సక్సెస్‌ఫుల్ గా బిగ్ బాస్ ను హోస్ట్ చేస్తూ వస్తున్న నాగార్జునే ఈ సారి కూడా హోస్ట్ చేస్తుండగా, సెప్టెంబర్ నుంచి సీజన్9 మొదలయ్యే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

# రాజమౌళి సినిమా.. రిస్కుకు సిద్ధమైన మహేష్



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో SSMB29 రూపొందుతున్న విషయం తెలిసిందే. స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా, మాలీవుడ్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆర్. మాధవన్ మహేష్ తండ్రిగా కనిపించనున్నట్లు సమాచారం. భారీ బడ్జెట్ తో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న సినిమా కోసం ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వని జక్కన్న.. షఉటింగ్ మాత్రం శరవేగంగా జరుపుతున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ ను పూర్తి చేసిన రాజమౌళి.. త్వరలో మూవీ టీమ్ కెన్యా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం హైదరాబాద్ శివార్లలో వేసిన వారణాసి సెట్ లో షఉట్ చేయనున్నారని సమాచారం. అయితే ఫారెస్ట్ అడ్వెంచర్ జోనర్ లో రూపొందుతున్న సినిమాపై ఇప్పటికే ఆడియన్స్ లో వేరే లెవెల్ అంచనాలు నెలకొన్నాయి. బ్లాక్ బస్టర్ హిట్ పక్కా అని ప్రతీ ఒక్క సినీ ప్రియుడు, ఫ్యాన్ ఫిక్స్ అయిపోయారని చెప్పాలి. అయితే సినిమాలో యాక్షన్ సీన్స్ ఫుల్ గా ఉన్నట్లు ఇప్పటికే అందరికీ అర్థమైపోయింది. ఫారెస్ట్ అడ్వెంచర్ కాబట్టి అనేక స్టంట్స్ ఉంటాయి. నెవ్వర్ బిఫోర్ అనేలా మహేష్ బాబు.. యాక్షన్ సీక్వెన్స్ లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో అంతా వాటిని చూసేందుకు ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పుడు మరో వార్త వైరల్ అవుతోంది. సాధారణంగా చాలా మంది హీరోలకు డూప్స్ ఉంటారు. కొన్ని యాక్షన్ సీన్స్ లో వారే నటిస్తారు. కానీ ఇప్పుడు డూప్స్ కు మహేష్ నో చెప్పేశారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తానే స్వయంగా యాక్షన్ మోడ్ లో దిగుతున్నారని సమాచారం. డూప్స్ బదులు హార్డ్ వర్క్ చేయాలని మహేష్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. అందుకు గాను ఇప్పటికే కసరత్తులు మొదలు పెట్టారని సమాచారం. ఇందులో నిజమెంతో తెలియదు. ఒకవేళ నిజమైతే మాత్రం.. ఇప్పటి వరకు మహేష్ కెరీర్ లో భారీ యాక్షన్ సీన్స్ లో నటించడం ఇదే తొలిసారి. రిస్క్ కూడా సిద్ధమైనట్లే. మరి చూడాలి ఏం జరుగుతుందో..

# 150 అనాధ ఆశ్రమాలను దత్తత తీసుకున్న మెగా కోడలు!



మెగా కోడలు ఉపాసన సామాజిక కార్యక్రమాల్లో ఎంతో చొరవ చూపిస్తుంటారు. సోషల్ మీడియా వేదికగా వీలైనంత వరకూ అవేర్ నేస్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుంటారు. ఆరోగ్యానికి సంబంధించిన విషయాలతో పాటు వ్యక్తి త్వ వికాసానికి సంబంధించిన అంశాలు మాట్లాడుతుంటారు. అలాగే అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి విషయాలపట్ల మరింత చురుకుగా పనిచేస్తున్నారు. తాజాగా ఉపాసన ఏకంగా 150 అనాధ ఆశ్రమాలను దత్తత తీసుకున్నారు. ఇక నుంచి వాటి బాధ్యత మొత్తం ఉపాసన చూసుకుంటారు. అనాధ బాలలు, వృద్ధులు పట్ల సహృదయంతో ఉపాసన ముందుకు కదలడం అన్నది ఎంతో గొప్ప విషయం. వాళ్లతో ఉపాసన మేమేకమవుతోన్న తీరు చూస్తుంటే? ఉపాసన మనసు ఎంత గొప్పదన్నది హైలైట్ అవుతుంది. 150 అనాధ శ్రమాల్లో వాళ్లకు కావాల్సిన అన్ని రకాల మౌళిక వసతులు కల్పిస్తున్నారు. అలాగే పండగలు..పబ్బాలు సమయంలో కూడా ఉపాసన ప్రత్యేకంగా ఇకపై పర్యటించే అవకాశం ఉంది. అనాధలంటే ఎవరూ లేని వారు కాబట్టి తమకు తోడుగా తాను ఉన్నానని భరోసా అన్ని రకాలుగా కల్పి స్తున్నారు. ఇప్పటికే అపోలా సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. తాజాగా 150 ఆశ్రమాలు కూడా తోడవ్వడంతో ఉపాసన మరింత బిజీగా ఉండనున్నారు. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో యాక్టివిటీ కూడా తగ్గించారు. చరణ్ కుసంబంధించిన విషయమో...అత్తమ్మకు సంబంధిం చిన విషయాలు అప్పుడప్పుడు పంచుకునేవారు. కానీ ఇప్పుడు అవి కూడా తగ్గాయి. అపోలా సహా సేవా కార్యక్రమాల్లో మరింత బిజీ అవ్వడంతోనే ఇంటి విషయాలకు ప్రాధాన్యత తగ్గించినట్లు కనిపిస్తుంది. ఉపాసన చేస్తోన్న ఈ సేవా కార్యక్రమాల విషయంలో రామ్ చరణ్ ఎంతో గర్విస్తున్నారు. ఇప్పటికే చిరంజీవి బ్లడ్ బ్యాక్ పేరిట పలు సేవా కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339